
ఈనాడు
అమరావతి
కృష్ణా


శనివారం అక్టోబరు 26, 2024 7


నందిగామ
ఎస్సీ బాలుర వసతిగృహం గదిలో పెచ్చులూడిన ఫ్లోరింగ్


పామర్రు
నిమ్మకూరులో పాడైన కిటికీలు


మోపిదేవి
కిటికీల తలుపులు ఊడిపోవడంతో బియ్యపు సంచులు కట్టారిలా..


బందరు
రైల్వేస్టేషన్ సమీపంలోని వసతిగృహంలో పాడైన మెష్


గన్నవరం
ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో ఫ్యాను రెక్కలు వంగి..

కష్టాలే వసతి.. కన్నీళ్లే గతి

- చలికాలం దుప్పట్లు లేక పిల్లల అవస్థలు
- సమస్యల వలయాల్లో వసతి గృహాలు
- వెంటాడుతున్న వైకాపా సర్కారు పాపాలు
- కూటమి ప్రభుత్వం చక్కదిద్దితేనే సంక్షేమం

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సంక్షేమ వసతిగృహాలు నరకానికి నకళ్లుగా తయారయ్యాయి. ఇందులో విద్యార్థులు కనీస వసతుల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇవి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. తాను విద్యార్థులకు మేనమామను అని కబుర్లతో కాలక్షేపం చేశారు నాటి ముఖ్యమంత్రి జగన్. అప్పటి పాలకుల పాపఫలితం విద్యార్థులకు శాపంగా మారింది. నాడు - నేడు పథకం ద్వారా రూపురేఖలు మారుస్తామని ప్రగల్భాలు పలికారు తప్ప.. ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. క్షేత్రంలో పరిస్థితులను పరిశీలిస్తే సంక్షేమం సిగ్గుపడే స్థాయికి దిగజారాయి. [illegible] తప్ప చేసిందేమీ లేదు. చలికాలం సమీపిస్తున్న వేళ విద్యార్థుల కష్టాలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. కప్పుకోవడానికి దుప్పట్లు లేవు. కిటికీలకు తలుపులు లేక సగం రాత్రివేళల్లోనే గజగజ వణుకుతున్నారు. దీనికి తోడు రాత్రివేళ ఎటు నుంచి విషపురుగులు, పాములు వచ్చి కరుస్తాయో అనే భయంతో నిద్రిస్తున్నారు. వైకాపా పెట్టిన పెచ్చులు ఏ క్షణం ఊడిపడతాయో తెలియదు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి సరైన మరుగుదొడ్లు కూడా లేని వైనం. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో కంటి నిండా నిద్ర పోవడం సాధ్యం కాని దుస్థితి. రెండు జిల్లాల్లో వసతిగృహాల్లో విద్యార్థుల ఆగచాట్లు అన్నీ ఇన్నీ కావు. 'న్యూస్‌టుడే' పరిశీలనలో వెలుగు చూసిన బాధాకర వేదన ఇది. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా స్పందించాలని అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. చలి తీవ్రత పెరగకముందే స్పందించి దుప్పట్లు, కిటికీలకు తలుపులు బిగించాలని, పాడైన వాటిని మరమ్మతులు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

- ఈనాడు డిజిటల్, అమరావతి, న్యూస్‌టుడే, బృందం

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వసతి గృహాలు..

	కృష్ణా	ఎన్టీఆర్	విద్యార్థులు
బీసీ	43	27	3782
ఎస్సీ	40	38	3385
ఎస్టీ	01	10	2093

(ఆశ్రమ, రెసిడెన్షియల్, ప్రతిభ కళాశాలలు కలిపి)


అవనిగడ్డ
పులిగడ్డలో పై అంతస్తు పిట్టగోడ విరిగిపోయి, పాడైన కిటికీలు


గొడవర్రు ఎస్సీ బాలికల హాస్టల్లో విద్యార్థినుల గదిలో కిటికీ డోరు పోయి..


పెదన
బీసీ కళాశాల హాస్టల్లో తలుపుల్లేని స్నానాల గదులు


కంకిపాడు
ఈడ్పుగల్లులో ఎస్సీ బాలుర వసతి గృహం కిటికీ తలుపులు విరిగి..


కూచిపూడి
మొవ్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో దుప్పట్లు, చాపలు లేకుండా నేలపైనే పడక..


గన్నవరం
ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో కిటికీల తలుపులు ఇలా..

దారెక్కడ.. దారుణమేగా?

అడుగడుగునా గుంతలు.. నిత్యం పదుల సంఖ్యలో ప్రమాదాలు.. పడితే లేవలేరు. ఇదీ కేసరపల్లి జంక్షన్ నుంచి కంకిపాడుకు వెళ్లే మలుపు వద్ద పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షాలకు చిన్నపాటి గుంతలు పెద్ద తటాకాల్లా మారి ప్రమాదకరంగా మారాయి. లోతు తెలియక నీటిలో దిగిన వాహనాలు గుంతల్లో ఇరుక్కుపోతున్నాయని, ఇప్పటికైనా గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. **- ఈనాడు, కృష్ణా**


అడుగడుగునా భారీ గుంతలే


ఈ మడుగులోకి దిగితే లేవలేరు మరి


రోడ్డు కోతకు గురై ఏర్పడిన భారీ గుంత

వర్సిటీలో విభాగాలపై న్యాక్ సమీక్ష

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జాతీయ అసెస్‌మెంట్, అక్రిడేషన్ కమిటీ(న్యాక్) సభ్యులు కృష్ణావిద్యాలయంలో నిర్వహిస్తున్న పర్యటన శుక్రవారంతో ముగిసింది. కమిటీ ఛైర్మన్ ఎన్‌కే లోక్‌నాథ్‌తో పాటు సభ్యులు రిచామదన్, సంజీవ్‌కుమార్‌శర్మ, ప్రదీప్‌డియోట, ప్రకాష్‌చంద్రప్రదాన్, సుప్రీతమ్‌రాయ్, హేమంత్‌దేశ్‌ముఖ్‌లు బృందాలుగా ఏర్పడి శుక్రవారం వివిధ విభాగాలను పరిశీలించారు. వివిధ కోర్సుల విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎన్‌సీసీ కార్యక్రమాల నిర్వహణపై అభినందించినట్లు తెలిసింది. ఆయా విభాగాల పరిశీలన అనంతరం ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు, రెక్టార్ బసవేశ్వరరావుతో పాటు ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షించారు. విశ్వవిద్యాలయం గ్రామీణ ప్రాంతంలో ఉండడం వల్ల కొంత ఇబ్బందులు ఉంటాయి, వాటిని అధిగమించేలా అందరూ సమన్వయంతో కృషి చేయాలని సూచించినట్లు తెలిసింది. విశ్వవిద్యాలయంలో బృందం పరిశీలించిన అంశాలపై ఇచ్చిన నివేదికను బట్టి నెల రోజుల్లో న్యాక్ గుర్తింపు ప్రకటించే అవకాశం ఉంది.


విద్యార్థులతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

తవ్వేది.. తోలేది.. మేమే!

- ముఖ్య ప్రజాప్రతినిధి బంధువు అడ్డగోలు
- బైపాస్ పనులకు ఆటంకం సృష్టిస్తున్న నేత
- మైలవరం, గన్నవరంలలో మారని వైఖరి

★ 'సార్ మరో మూడు నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు..! మమ్మల్ని పనులు చేసుకోనీయండి..! దయచేసి గ్రావెల్‌కు అడ్డుపడకండి..!'

★ 'లేదు.. మేమే తోలతాం..! మీకు సంబంధం లేదు.. లారీలు వెంటనే ఆపేయాల్సిందే..!' నియోజకవర్గానికి చెందిన ఓ నేత తీరు ఇది..!

" వైకాపా జమానాలో ఇష్టానుసారం గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపిన నేతలు.. ప్రభుత్వం మారినా వారి తీరు మారలేదు. మట్టి గ్రావెల్ తామే నిర్వహించాలని పట్టుబడుతున్నారు. అక్రమమైనా.. సక్రమమైనా.. లీజులు ఎవరైనా.. ప్రభుత్వ స్థలమైనా.. పట్టా భూములైనా.. తామే నిర్వహించాలని పట్టుబడుతున్నారు. దీంతో లైసెన్సులు పొందిన వారు సైతం అవాక్కవుతున్నారు. మరోవైపు చోటా నాయకులు.. తమకూ వాటాలు కావాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగైతేనే గ్రావెల్ లారీలను కదలనిస్తామని హెచ్చరిస్తున్నారు. "

ఈనాడు - అమరావతి

విజయవాడ బైపాస్ నిర్మాణం శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్ జిల్లాలో మూడో ప్యాకేజీ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఇంకా పది శాతం పనులు, హైటెన్షన్ తీగల తొలగింపు మిగిలాయి. కృష్ణా నదిపై వంతెన నిర్మాణం చివరిదశకు వచ్చింది. గుంటూరు జిల్లాలో నాలుగో ప్యాకేజీ నిర్మాణం జరుగుతోంది. దీన్ని నవయుగ, అదాని సంస్థ సంయుక్తంగా దక్కించుకున్నాయి. కొంత నత్తనడకన సాగుతున్న బైపాస్ నిర్మాణంపై సీఎం చంద్రబాబు ఇటీవల సమీక్షించారు. రాజధానికి వెళ్లే రహదారుల వద్ద పైవంతెనలు నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. ఈప్యాకేజీ పనులు మరో మూడు నాలుగు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికి పెద్దఎత్తున గ్రావెల్ మట్టి అవసరం. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి దీన్ని సేకరిస్తున్నారు. మరోవైపు వీటీపీఎస్ బూడిద వినియోగిస్తున్నారు. ఈరెండింటి సరఫరాకు అడ్డంకులు ఎదురవుతున్నాయి.


తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం

మళ్లీ తెరపై వారే..!

గత ప్రభుత్వంలో బైపాస్ నిర్మాణం ప్రముఖ సంస్థలు చేపడుతున్నా.. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల వైకాపా ప్రజాప్రతినిధులు, వారి అనుచరులే బూడిద, గ్రావెల్ సరఫరా చేశారు. అక్రమంగా పెద్దఎత్తున తవ్వారు. కొత్తూరు తాడేపల్లిలో నాటి ఎంపీ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగాయి. జాతీయ రహదారి నిర్మాణ సంస్థ నుంచి భారీగా బిల్లులు తీసుకున్నారు. ప్రస్తుతం అదే తరహా నడుస్తోంది. మైలవరంలో గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఓ ప్రజాప్రతినిధి బంధువు ఇప్పుడు అడ్డుతగులుతున్నారు. మైలవరం మండలం చంద్రాల, ఎదురుబీడుల్లో రెవెన్యూ పోరంబోకు వద్ద 5 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులు లీజుకు తీసుకుని గ్రావెల్‌కు అనుమతి పొందారు. దీనిలో గతంలో ప్రజాప్రతినిధి వద్ద పీఏగా పనిచేసిన ఓ వ్యక్తి ఉన్నారు. మరో ప్రైవేటు వ్యక్తి అసైన్డ్ భూముల్లో తవ్వకాలకు అనుమతి తెచ్చుకున్నారు. వీరు నవయుగ కోసం గ్రావెల్ తరలిస్తుంటే ప్రజాప్రతినిధి బంధువు అడ్డుకున్నారు. తామే సరఫరా చేస్తామని.. ఓ ఎంపీపీతో (వైకాపా) కలిసి అడ్డుతగిలారు. దీనిని ఆ సంస్థ ప్రాజెక్టు మేనేజరు రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. మైలవరం, గన్నవరం పరిధిలో ఎవరూ తవ్వకాలు జరిపేది లేదనీ.. అంతా తానే చూసుకుంటానని ఆ బంధువు హెచ్చరిస్తున్నారు.


మైలవరం మండలం ఎదురుబీడు వద్ద నిలిపేసిన లారీలు

మాకూ వాటాలు..!

జి.కొండూరు మండలంలోనూ కొంత ప్రైవేటు పట్టా భూమిలో లీజులు ఉన్నాయి. మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. వెలగలేరులో దీన్ని అడ్డుకుంటున్నారు. తమకు అనుమతులు ఉన్నాయని వాదిస్తుంటే.. మాకూ వాటాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే వాహనాలు వెళ్లనీయబోమని హెచ్చరిస్తున్నారు. దీనిపై వెలగలేరులో రెండు వర్గాల మధ్య ఘర్షణ కూడా జరిగింది. దీని వెనుకా ప్రజాప్రతినిధి బంధువే ఉన్నారు. వైకాపా నాయకులే చక్రం తిప్పుతున్నారు. ఆ ప్రజాప్రతినిధి అండ బాగా ఉన్నట్లు చెబుతున్నారు. అన్ని పంచాయితీలు ఆ బంధువుల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. తనకు తెలియనట్లు ప్రజాప్రతినిధి వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు.

కౌలు రైతుకు.. ఎదురుచూపులే!

సీసీఆర్సీ కార్డులున్నా దక్కని పెట్టుబడి రుణం

న్యూస్‌టుడే, మచిలీపట్నం (కోనేరుసెంటరు), బంటుమిల్లి

ప్రభుత్వాలు మారుతున్నా కౌలు రైతుల సంక్షేమం కోసం పాలకులు ఇస్తున్న హామీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. వార్షిక పంట రుణ లక్ష్యాన్ని మించి రైతులకు రుణాలు ఇచ్చినట్లు బ్యాంకర్లు చెబుతున్నా క్షేత్రస్థాయి పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయి. జిల్లాలో అత్యధిక శాతం విస్తీర్ణంలో కౌలుదారులే సాగు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారికి పెట్టుబడి నిమిత్తం రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు మొండి చెయ్యే చూపిస్తున్నారు. ఫలితంగా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేయడం గిట్టుబాటు కాకపోవడానికి తోడు ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పంట నష్టపోతే కోలుకోలేని దీనస్థితికి చేరువవుతున్నారు. జిల్లా మొత్తం మీద రమారమి రెండు లక్షల మంది వరకూ కౌలుదారులు ఉండగా ఈ ఏడాది రూ.23 కోట్లు మాత్రమే వారికి పంట రుణంగా దక్కింది.

పరిహారమూ దక్కలేదు.. కౌలురైతులకు రుణాలు ఇవ్వాలన్న లక్ష్యంతో అర్హులైన వారికి సాగుహక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్సీ) ఇచ్చి వాటి ద్వారా పంట రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. భూయజమానులకు రుణం ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్న బ్యాంకర్లు సీసీఆర్సీ కార్డుదారులకు మాత్రం కొర్రీలు వేస్తున్నారు. రుణం కోసం గట్టిగా నిలదీస్తే భూయజమానితో ష్యూరిటీ ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక గత్యంతరం లేని పరిస్థితుల్లో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేసిన కౌలుదారులను ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదలు నిలువునా ముంచాయి. రోజుల తరబడి నీట మునిగి ఉన్న పంట కుళ్లిపోవడంతో 40 శాతానికి పైబడిన సాగుదారులకు కనీస పెట్టుబడి కూడా దక్కకుండా పోయింది. రైతును ఆదుకునే క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం కూడా కౌలురైతులకు దక్కడం అంతంతమాత్రమే అయ్యింది.



ఇచ్చింది రూ.23.22 కోట్లే..

నిబంధనల మేరకు గరిష్ఠంగా రూ.3లక్షల వరకూ రుణం ఇచ్చే అవకాశం ఉన్నా కంటి తుడుపుగా రుణం ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఖరీఫ్ సాగు కోసం రూ.23.22 కోట్లు మాత్రమే కౌలు దారులకు ఇచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సీసీఆర్సీ కార్డులు అందజేసి రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతులు కోరుతున్నారు.

కృష్ణా జిల్లాలో..

పంట రుణ లక్ష్యం	రూ.3,734 కోట్లు
సాగు విస్తీర్ణం	1.51 లక్షల హెక్టార్లు
మొత్తం రైతుల్లో కౌలు చేసేవారు	70 శాతం
కౌలు రైతులు (సుమారు)	2 లక్షలు
సీసీఆర్సీ కార్డులు తీసుకున్నది	66,334
ఖరీఫ్‌లో రుణాలు పొందింది	5,735 మంది

యజమాని అంగీకారం ఉండాలట

- ఆరేపల్లి దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణపురం



12 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నా. వ్యవసాయ భూముల యజమానులు పలువురు అంగీకారం తెలపకపోవడంతో మొత్తం విస్తీర్ణానికి కౌలు కార్డు రాలేదు. మద్దేటిపల్లిలో సాగు చేస్తున్న 2 ఎకరాలకు మాత్రమే కౌలు కార్డు మంజూరైంది. కౌలు కార్డు ద్వారా రుణం కోసం బ్యాంకు వారిని సంప్రదించగా యజమాని అంగీకారం ఉంటేనే ఇస్తామన్నారు. సాగుకు పెట్టుబడి కోసం బయట వ్యక్తుల వద్ద వడ్డీలకు నగదు తీసుకోవాల్సి వచ్చింది. ఎటువంటి షరతులు లేకుండా కౌలు కార్డు మీద రుణం మంజూరు చేయాలని కోరుతున్నాం.

గ్రూపుగా వస్తేనే ఇస్తారట

- దేవిరెడ్డి నాగేశ్వరరావు, పెందుర్రు



నేను బంటుమిల్లి మండలం ముల్లపర్రు రెవెన్యూ పరిధిలో మూడు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని పదేళ్లుగా సాగు చేస్తున్నా. కౌలుకార్డుపై రుణం కోసం బ్యాంకు వారిని సంప్రదిస్తే గ్రూపుగా వస్తేనే ఇస్తామని కొర్రీ పెట్టారు.

బ్యారేజీకి వరద ఉద్ధృతి

ఎన్టీఆర్ కలెక్టరేట్: కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద శుక్రవారం వరద ఉద్ధృతి నెలకొంది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 1,59,916 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 1,45,250 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు 2,36,158 క్యూసెక్కులకు పెరిగింది. 30 గేట్లను 5 అడుగులు, మిగతా 40 గేట్లను 4 అడుగులు మేర ఎత్తారు. సముద్రంలోకి 2,20,500 క్యూసెక్కులు, పంట కాల్వలకు 15,658 క్యూసెక్కులు విడుదల చేశారు. రాత్రి 8 గంటలకు ఎగువ నుంచి 2,17,150 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 2,01,492, కాల్వలకు 15,658 క్యూసెక్కులను విడుదల చేశారు.

ఇంద్రకీలాద్రిపై 11 నుంచి భవానీ మండల దీక్షలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే భవానీ మండల దీక్షలు నవంబరు 11 నుంచి ప్రారంభం అవుతాయి. నవంబరు 11 నుంచి 15 వరకు మండల దీక్షలు, డిసెంబరు 1 నుంచి 5 వరకు అర్ధమండల దీక్షల స్వీకరణ తేదీలుగా నిర్ణయించారు. 14న సత్యనారాయణ పురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సాయంత్రం 6.30 గంటలకు భవానీ దీక్షాధారుల కలశయాత్ర ఆరంభం కానుంది. అక్కడ నుంచి ఏలూరు, బందరు రోడ్డు మీదుగా యాత్ర కనకదుర్గానగర్‌కు చేరుతుంది.

డిసెంబరు 21- 25 వరకు దీక్షల విరమణ.. దుర్గగుడి ఆధ్వర్యంలో డిసెంబరు 21-25 వరకు దీక్షల విరమణ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఉత్సవాల తరహాలోనే దీక్షల స్వీకరణ, విరమణ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని నిర్ణయించారు.

పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు

జిల్లా పరిధిలో 200 బస్సుల ఏర్పాటు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), గుడివాడ పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పుణ్యక్షేత్రాల సందర్శన కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. గతేడాది 150 ప్రత్యేక సర్వీసులు నిర్వహించగా ఈ ఏడాది భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని డిపోల నుంచి 200 ప్రత్యేక సర్వీసులు నిర్వహించేలా జిల్లా ప్రజా రవాణా అధికారిణి ఎ.వాణిశ్రీ ఆదేశాలు జారీ చేశారు. బృందాలుగా వెళ్లాలనుకునే భక్తులకు అద్దె ప్రాతిపదికన ఏసీ, స్టార్‌లైనర్, సూపర్‌డీలక్స్ బస్సులు ఇవ్వనున్నారు. వచ్చే నెల రెండో తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్తికమాసం నిమిత్తం ప్రసిద్ధ శైవక్షేత్రాలైన పంచారామాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. ప్రతి ఆదివారం, కార్తిక పౌర్ణమి రోజు అరుణాచలం దర్శించుకునే విధంగా అన్ని డిపోల పరిధి నుంచి సర్వీసులు నిర్వహిస్తున్నారు. యాగంటి, మహానంది, శ్రీశైలం పుణ్యక్షేత్రాలను రోజున్నర వ్యవధిలో సందర్శించుకునేలా త్రిలింగ దర్శిని ప్యాకేజీ అమలు చేస్తున్నారు. వీటితో పాటు మంత్రాలయం, వాడపల్లి తదితర ప్రాంతాలకు అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నిర్వహించనున్నారు.

రిజర్వేషన్ సౌకర్యం

పుణ్యక్షేత్రాల సందర్శన కోసం అవనిగడ్డ డిపో నుంచి 38, గుడివాడ 50, మచిలీపట్నం 70, గన్నవరం 23, ఉయ్యూరు డిపో పరిధి నుంచి 19 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. వీటిలో ప్రయాణించదలుచుకున్న వారు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చు. అవనిగడ్డ డిపో 9959225466, మచిలీపట్నం 9959225462, గుడివాడ 9959225464, ఉయ్యూరు 9959224796, గన్నవరం 8790996090 నంబర్లకు కాల్ చేసి టికెట్లు బుక్ చేయించుకోవచ్చు.

విడుదల కాని నిధులు.. ఎంపీటీసీల వేతలు

తొమ్మిది నెలలుగా ఎదురుచూపు



మండల పరిషత్తు సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యులు

— న్యూస్‌టుడే, కంకిపాడు —

మండల పరిషత్తు ప్రజాప్రతినిధులు గౌరవ వేతనం కోసం ఎదురుచూస్తున్నారు. గతేడాది డిసెంబరు వరకు చెల్లించారు. నిధుల లభ్యతను బట్టి ప్రతి మూడు నెలలకోసారి జమ చేయడం ఆనవాయితీగా వస్తోంది. గత మార్చి నెలలో బిల్లు పెట్టినా నిధుల కొరతతో ఇప్పటి వరకు విడుదల చేయలేదని తెలుస్తోంది. ఆ తర్వాత ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో చెల్లింపుపై దృష్టి పెట్టేవారు కరవయ్యారు. ప్రధానంగా ఎంపీటీసీల్లో పేద, మధ్య తరగతివారు అధికంగా ఉన్నారు. సమావేశాలు, గ్రామానికి సంబంధించిన వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వెళ్లడానికి చేసిన ఖర్చులను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. చెల్లించాల్సిన గౌరవ వేతనం బకాయిలు సుమారు రూ. 1.26కోట్లుగా అంచనా.

జిల్లాలో మండల పరిషత్తులు – 25

ఎంపీపీలు: 24 (పెనమలూరు మినహా)
జడ్పీటీసీలు: 23
(ఉయ్యూరు జడ్పీటీసీ రాజీనామా చేయగా, పెనమలూరుకు ఎన్నిక జరగలేదు)

పదవులు	చెల్లించాల్సింది
ఎంపీటీసీలు–375	రూ.1,01,25,000
ఎంపీపీలు–24	రూ.12,96,000
జడ్పీటీసీ సభ్యులు–23	రూ.12,42,000

విడుదల చేయాల్సిన మొత్తం
రూ.1,26,63,000

గౌరవ వేతనాలు ఇలా..

సర్పంచి, ఎంపీటీసీలకు నెలకు రూ.3వేలు, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ.6వేలు. సర్పంచులు పంచాయతీకి చెందిన నిధులు సర్దుబాటు చేసుకున్నా మిగతా వారికి ఈ వెసులుబాటు లేదు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

– కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీ, మంతెన



కూటమి ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి గౌరవ వేతనం నిధులు విడుదల చేయాలి. గత మార్చి నెలలో చెల్లించకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. ప్రతిపాదనల పద్దులను ఉన్నతాధికారులకు పంపామని స్థానిక అధికారులు చెబుతున్నారు.

ఆర్యవైశ్య అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు ఆర్యవైశ్య కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, ఆర్యవైశ్య కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బీ బ్లాక్ మూడవ అంతస్తులోని ఈనాడు ఆఫీస్‌లో నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (26 అక్టోబర్ 2024 శనివారం) రేపు (27 అక్టోబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు** తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 80080 01686 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు.
రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు 29, 30 తేదీల్లో ఆటల పోటీలు

భాస్కరపురం (మచిలీపట్నం): సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలను ఈ నెల 29, 30 తేదీల్లో మచిలీపట్నం స్విమ్మింగ్ పూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార అధికారిణి కె.ఝాన్సీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. 29వ తేదీ మంగళవారం అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, హాకీ, క్రికెట్, రెజ్లింగ్, క్యారమ్స్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీలు ఉంటాయని వివరించారు. 30వ తేదీ బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. పోటీల్లో ఎంపికైన జిల్లా జట్టు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నవంబరు 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే ఉద్యోగులు ఉద్యోగ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, మూడు ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే వారు క్రీడా దుస్తులు ధరించి పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు 94946 43658 నంబరులో సంప్రదించాలన్నారు.

'పల్లె పండగ' పనుల్లో నాణ్యత తగ్గితే చర్యలు



శ్రీనగర్‌కాలనీలో రహదారి పనుల వివరాలను అధికారుల నుంచి తెలుసుకుంటున్న గ్రామీణాభివృద్ధి జేసీ సునీత

పెదపులిపాక(పెనమలూరు), న్యూస్‌టుడే: 'పల్లె పండగ' పనుల్లో నాణ్యత తగ్గితే సహించేది లేదని రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కలెక్టర్ జె.సునీత స్పష్టం చేశారు. రూ. 2.15 కోట్ల వ్యయంతో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో పెదపులిపాకలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. శ్రీనగర్‌కాలనీ, గణపతినగర్, ఎంఐజీకాలనీలతో పాటు శ్మశాన ప్రహరీగోడ నిర్మాణాల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. పనులపై ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణ నిరంతరం ఉండాలన్నారు. నాణ్యత కొరవడితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రాజేష్, గ్రామ కార్యదర్శి వెంకటరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాగులచవితికి విస్తృత ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆలయ ఈవో ప్రసాదరావు, హాజరైన వివిధ శాఖల అధికారులు

మోపిదేవి, న్యూస్‌టుడే: నాగుల చవితి సందర్భంగా ఈ నెల 5న వివిధ ప్రాంతాల నుంచి మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య అధ్యక్షతన సంబంధిత శాఖల సమన్వయ కమిటీ సమావేశం ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. తెల్లవారుజామున 2.30 నిమిషాలకు అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య నాగపుట్ట పూజ, 3 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు. 120 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు సీఐ ఈశ్వరరావు పేర్కొన్నారు. ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. వాహనాల పార్కింగ్, అన్నదాన ఏర్పాట్లు, క్యూలైన్లు, అతిథులకు ప్రత్యేక ఏర్పాట్లు, తదితర అంశాలపై సమీక్షించారు. ఉదయం 11 గంటలకు స్వామి నిత్యకల్యాణ మహోత్సవం జరుగుతుందని, మిగిలిన ఆర్జిత సేవల పూజలు తాత్కాలికంగా రద్దుచేసినట్లు ఈవో తెలిపారు. ఎంపీడీవో స్వర్ణభారతి, ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ, అగ్నిమాపక అధికారి పీఎస్‌వీఎస్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి నైపుణ్య శిక్షణ ఊతం



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిన్నాపురం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: వాటర్ హయసింత్(గుర్రపుడెక్క) కళను అవలంబించడం ద్వారా గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ డి.కె.బాలాజీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేపాక్షి హస్తకళల సహకారంతో వాటర్ హయసింత్ కళలో గ్రామీణ మహిళలకు నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం శుక్రవారం బందరు మండలం చిన్నాపురం ఎన్డీ కాలనీ కమ్యూనిటీ హాల్లో జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ బందరు పరిసర ప్రాంతాల్లో గుర్రపుడెక్క, కిక్కిస, తూటికూర వంటి వాటితో కాలువలు, డ్రైన్లు నిండిపోయి, నీటి ప్రవాహానికి ఆటంకంగా మారడాన్ని గమనించామన్నారు. వీటిని తొలగించడానికి రూ.కోట్ల వ్యయం చేయాల్సిన పరిస్థితుల్లో దీనిని ఏ విధంగా వినియోగించవచ్చో ఆలోచించి, నిపుణులతో చర్చించామని చెప్పారు. కళాకృతుల తయారీలో వినియోగించవచ్చని తెలుసుకుని ఆ దిశగా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పర్యావరణానికి హానికరం కాని గుర్రపుడెక్కను వినియోగించి అనేక కళాకృతులు తయారు చేయడంలో లేపాక్షి సహకారంతో మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మహిళలు తయారు చేసిన కళాకృతులకు లేపాక్షి ఎంపోరియం ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. లేపాక్షి హస్తకళల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.విశ్వ శిక్షణ కార్యక్రమం గురించి వివరిస్తూ రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత, లేపాక్షి ఎండీ బాలసుబ్రహ్మణ్యరెడ్డిల ఆదేశాల మేరకు వాటర్ హయసింత్ క్రాఫ్ట్‌ను ప్రోత్సహించడానికి 40 మందికి 4 నెలలు శిక్షణ ఇస్తున్నామన్నారు. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని హ్యాండీక్రాఫ్ట్స్ సర్వీస్ సెంటర్ విజయవాడ కేంద్ర సహాయ సంచాలకులు అపర్ణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం సర్పంచి కాగిత గోపాలరావు, పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు, జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ సాయిప్రసాద్, లేపాక్షి హస్తకళల మేనేజర్ సురేష్, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

జోన్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 28, 29

పెడన (గ్రామీణం), న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల జోన్ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల 28, 29 తేదీల్లో ద్వారకా తిరుమలలో జరుగుతుందని ఆ పాఠశాలల సమన్వయకర్త కె.ప్రేమావతి తెలిపారు. నాలుగు అంశాలు లెక్కలు, సైన్సు, సోషల్, ఇన్నోవేషన్ కంప్యూటర్ టెక్నాలజీతో పాటుగా క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ తదితర అంశాల్లో జిల్లా స్థాయిలో ఎంపికైన వారు జోనల్ స్థాయిలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూనియర్ విభాగం (6, 7, 8 తరగతులు), సీనియర్ విభాగం (9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులు) జిల్లా స్థాయిలో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు. ఒక్కొక్క అంశం నుంచి ప్రతి విభాగంలో రెండు బృందాలు జోన్ స్థాయిలో పోటీ పడతాయని తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి పెట్టండి: కలెక్టర్

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: సాగు నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలకు సంబంధించి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులకు నీటి సంఘాల ఎన్నికలపై నిర్వహించిన శిక్షణలో ఆయన పలు సూచనలు చేశారు. ప్రాథమిక నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఉండి 18 ఏళ్లు నిండిన రైతులను గుర్తించి ఓటరు జాబితాలు సిద్ధం చేస్తారన్నారు. నీటి సంఘాల ఎన్నికలకు జిల్లా ఎన్నికల అథారిటీగా కలెక్టర్, అదనపు జిల్లా ఎన్నికల అథారిటీగా జేసీ, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు డివిజన్ల సంబంధిత డిప్యూటీ జిల్లా ఎన్నికల అథారిటీలుగా వ్యవహరిస్తారన్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో స్వాతి, డ్వామా పీడీ శివప్రసాద్, పలువురు తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దివిసీమకు 2.20 లక్షల క్యూసెక్కుల వరద

పులిగడ్డ(అవనిగడ్డగ్రామీణం): అల్పపీడనం ప్రభావంతో వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వరద నీటిని విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రానికి దివిసీమ ముఖద్వారమైన పులిగడ్డ అక్విడెక్టు వద్ద 2.20 లక్షల క్యూసెక్కుల వరద కడలివైపు ప్రవహిస్తోంది. మరో రెండు రోజులపాటు వరదనీటి ప్రవాహం ఉంటుందని జలవనరులశాఖ పులిగడ్డ సబ్ డివిజన్ డీఈఈ పి.వెంకటేశ్వరరావు తెలిపారు.

తొమ్మిది కిలోల గంజాయి పట్టివేత... ముగ్గురు అరెస్టు



మద్దులూరు వద్ద పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మీదుగా రవాణా చేస్తున్న గంజాయిని శుక్రవారం సాయంత్రం మారేడుమిల్లి పోలీసులు పట్టుకున్నారు. తొమ్మిది కిలోల గంజాయితో.. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఒక చరవాణీ స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి రవాణాపై ముందస్తు సమాచారం మేరకు మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై రామునాయుడు మద్దులూరు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు తప్పించుకుని వెళ్లిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఈ ఘటనలో మచిలీపట్నానికి చెందిన జల్లి నిఖిత్‌కుమార్, భూక్య శివాజీ, పుట్టి సాయిధీరజ్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి తొమ్మిది కిలోల గంజాయితో పాటు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మచిలీపట్నానికి చెందిన షేక్‌బాబావలీ ధారకొండ నుంచి గంజాయిని తీసుకొచ్చి, అప్పగిస్తే తమకు నగదుతోపాటు, కొంత గంజాయి ఇస్తానని చెప్పినట్లు నిందితులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.45 వేలు ఉంటుందని అంచనా. దీనిపై సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమాలకు అనుమతి తప్పనిసరి

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ తలిదండ్రుల, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రకారం కృష్ణాజిల్లాలో వృద్ధాశ్రమాల నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొందాల్సి ఉంటుందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, కృష్ణాజిల్లా సహాయ సంచాలకులు వి.కామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి కోసం సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంజూరు చేస్తామన్నారు. గుర్తింపులేని వృద్ధాశ్రమాలను అనుమతి లేకుండా నిర్వహిస్తున్నట్లు పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూర్తి సమాచారం కోసం కార్యాలయ ఫోన్ నెంబరు 0867 2252637లో సంప్రదించాలని సూచించారు.

హత్యకేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లిలో కలకలం సృష్టించిన బీసీ హాస్టల్ విద్యార్థి దాసరి ఆదిత్య హత్యకేసులో నిందితుడికి మూడేళ్లు జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లపల్లి జడ్పీ పాఠశాల ఆవరణలోని బీసీ వసతి గృహంలో ఆదిత్య అనే విద్యార్థిని 2019 ఆగస్టులో తోటి విద్యార్థి బ్లేడుతో గొంతుకోసి హత్యచేశాడు. ఈ హత్య ఘటనపై అప్పటి ఎస్‌ఐ పి.నాగరాజు కేసు నమోదు చేయగా, సీఐ ఎన్.వెంకటనారాయణ దర్యాప్తు చేశారు. నిందితుడిపై (మైనర్) నేరం నిరూపణ కావడంతో విజయవాడ సెకండ్ మెట్రోపాలిటన్ కోర్టు జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి జస్టిస్ కె.మాధవిదేవి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడిని విశాఖపట్నం స్పెషల్ హోమ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

బాలికపై అత్యాచారం.. పోక్సో కేసు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికపై అత్యాచారం చేసిన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. కంకిపాడు ఎస్సై సందీప్ అందజేసిన వివరాల మేరకు.. గోసాలకు చెందిన బాలికను కడపకు చెందిన బాలుడు ప్రేమ పేరుతో వంచించి అత్యాచారం చేశాడు. ఈ విషయం బాలిక తండ్రికి తెలియడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు కూడా ఇంటర్మీడియట్ చదువుతున్నారని ఎస్సై తెలిపారు.

బేతవోలులో బంగారు ఆభరణాల చోరీ

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ బేతవోలులోని ఓ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ. 1.72 లక్షల విలువైన ఆభరణాలు, నగదు చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం బేతవోలుకు చెందిన బూరగడ్డ నాగేశ్వరరావు కుటుంబం ఈ నెల 22న హైదరాబాద్ వెళ్లారు. తిరిగి 24న రాత్రి గుడివాడ బయలు దేరారు. ఈ నేపథ్యంలో మీ ఇంటి తలుపులు తీసి ఉన్నాయని పొరుగింటి వ్యక్తి ఫోన్ చేసి చెప్పారు. వారు వచ్చి చూసే సరికి ఇంట్లోని 35 గ్రాముల బంగారం, రూ.50 వేల నగదు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలో ఇనుప చువ్వలు..

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: నిర్మాణంలో ఉన్న మల్లవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఇనుప చువ్వలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణమోహన్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ అచ్చి రమేష్ శుక్రవారం వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 1.5 టన్నుల బరువున్న 150 ఇనుప చువ్వలను గుర్తు తెలియని వ్యక్తులు తరలించుకు పోయినట్లు వీరు ఫిర్యాదులో పేర్కొన్నారు. నాడు-నేడు రెండో విడత కింద గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాల భవన నిర్మాణం చేపట్టారు. కొంతమేర పనులు జరిగాయి. మిగతా పనుల నిమిత్తం సరఫరా చేసిన ఇనుప చువ్వలకు గొలుసులు కట్టి, వాటికి తాళాలు వేసి అక్కడే భద్రపర్చారు. శుక్రవారం పాఠశాల వద్దకు వెళ్లిన ప్రధానోపాధ్యాయుడికి ఇనుము కనపడకపోవడంతో స్థానికుల్ని విచారించారు. గుర్తు తెలియని కొందరు ట్రాక్టరులో ఇనుము తరలించినట్లుగా తెలియడంతో ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రామ కార్యదర్శులకు ఎంపీడీవో మెమోలు

పెనమలూరు, న్యూస్‌టుడే: బదిలీ అయ్యారు.. కానీ తమ స్థానంలో బదిలీపై వచ్చిన గ్రామ కార్యదర్శులకు మాత్రం బాధ్యతలు అప్పగించడం లేదు. పెనమలూరు మండలంలో నెలకొన్న గ్రామకార్యదర్శుల వింత వైఖరిపై ఎంపీడీవో బండి ప్రణవి శుక్రవారం సీరియస్ అయ్యారు. బదిలీపై వెళ్లిన కార్యదర్శులు కీలక ఫైళ్లను ఇప్పటికీ తమ అధీనంలోనే పెట్టుకోవడం, ఆర్థిక లావాదేవీలకు చెందిన బిల్లులు, రసీదు పుస్తకాలను బీరువాల్లో దాచి తాళాలు ఇవ్వకపోవడంతో పంచాయతీలో జరగాల్సిన సాధారణ పరిపాలనా వ్యవహారాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. మరి కొద్ది రోజుల్లో గ్రామ పంచాయతీల బడ్జెట్ ప్రణాళికలను రూపొందించాల్సి రావడంతో బదిలీపై వచ్చిన గ్రామ కార్యదర్శులు నాలుగు రోజుల నుంచి గగ్గోలు పెడుతున్నారు. ఈ వ్యవహారాల్లో ఓ గ్రామానికి చెందిన బదిలీ అయిన కార్యదర్శికి, బదిలీపై అదే గ్రామానికి వచ్చిన గ్రామ కార్యదర్శికి నడుమ రెండ్రోజుల కిందట పెద్ద రగడ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారాలన్నీ ఎంపీడీవో ప్రణవి దృష్టికి రావడంతో ఆమె బదిలీపై వెళ్లిన గ్రామ కార్యదర్శులకు మెమోలు అందజేశారు. వెంటనే స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు. పెనమలూరు, పెదపులిపాక, గంగూరు, గోసాల, వణుకూరు గ్రామ కార్యదర్శులు ఛార్జి అప్పగించని వారిలో ఉన్నట్లు సమాచారం.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

గూడూరు వ్యవసాయాధికారిగా ఆంజనేయకుమార్



గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు మండలం వ్యవసాయాధికారిగా కె.ఆంజనేయకుమార్ నియమితులయ్యారు. వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో పాడిపంటల మాస పత్రిక వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న ఆయన్ని ప్రభుత్వం గూడూరు ఏవోగా నియమించగా ప్రస్తుతం ఏవోగా ఉన్న శివ ప్రసాద్‌ను కమిషనరేట్‌కు బదిలీ చేశారు.

సినిమాలు

రేవతి – వేట్టయన్
మినీరేవతి – లగ్గం, సిరి
వెంకట్ – దేవర,
సిరికృష్ణ – వెనమ్,
రామరాజు – పొట్టేల్
- మచిలీపట్నం కార్పొరేషన్

దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి షేక్ షాహిద్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 27 వరకు పొడిగించినట్లు తెలిపారు. జ్ఞానభూమి వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పాఠశాలల పరిశీలన

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ బంగ్లా ప్రాథమిక, జోగానందన రావు కాలనీ ప్రాథమిక పాఠశాలల్ని ఎంఈవోలు శుక్రవారం పరిశీలించారు. బంగ్లా పాఠశాలను ఎంఈవో-2 దుర్గా ప్రసాద్, జోగానందనరావు కాలనీ పాఠశాలను ఎమ్మీవో-2 వైవీ హరనాథ్ తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687



రామరాజుపాలెం ప్రాంతంలో డివైడర్ మధ్యలో కొమ్మలు తొలగిస్తున్న కార్మికులు

స్పందనకు వందనం

★ మచిలీపట్నం నుంచి విజయవాడ వెళ్లే జాతీయ రహదారి వెంబడి గూడూరు మండలంలోని రామరాజుపాలెం ప్రాంతంలో డివైడర్‌పై ఉన్న మొక్కలు పెరిగి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులతో పాటు ప్రయాణికులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు సమస్యను వివరించిన వెంటనే వాటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

★ నగరంలోని నాయర్‌బడ్డీ సెంటరుకు వెళ్లేదారితో పాటు వివిధ ప్రాంతాల్లో రహదారుల పక్కన ఉన్న చెత్త కారణంగా రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు చెప్పిన వెంటనే సిబ్బందిని పంపి తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

? నగరంలోని మల్కాపట్నం ప్రాంతంలో రాత్రి సమయాల్లో పందుల సంచారం ఎక్కువగా ఉంది. ఇంటి పరిసర ప్రాంతాల్లోకి వస్తున్నాయి.
-సుబ్బు, మల్కాపట్నం



మల్కాపట్నంలో సంచరిస్తున్న పందులు

✔ పందుల యజమానులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
-బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్
-మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే

? మచిలీపట్నం రాడార్ కేంద్రం రోడ్డు మార్జిన్లను చేసి మట్టిని గుట్టలుగా చేశారు. వాటిని రోజుల తరబడి తొలగించడం లేదు. రోడ్డు ఇరుకై ఇబ్బందిగా ఉంది.-
రమేష్, ఆర్టీసీ కాలనీ, మచిలీపట్నం..
✔ సిబ్బందిని పంపి మట్టిగుట్టలు తొలగిస్తాం.
-మహేష్, శానిటరీ కార్యదర్శి, మచిలీపట్నం కార్పొరేషన్
-భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే

? నందమూరు, శివారు గ్రామాలకు మంచినీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఉప్పులకుంటను సామాజిక రక్షిత పథకం నుంచి నీరు రావడం లేదు. ప్రధాన పైపు లైను మరమ్మతులు చేయాల్సి ఉంది.
-స్థానికులు
✔ ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. ఈ పథకాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.-పరసా నరసింహారావు, నందమూరు సర్పంచ్

? నందమూరు సంపద కేంద్రానికి విద్యుత్తు సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి.-స్థానికులు
✔ ఈ కేంద్రానికి సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.
-జయరామ్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెడన
పెడనగ్రామీణం, న్యూస్‌టుడే

కునుకు తీయలేక.. కుదుట పడలేక..

వసతిగృహాల్లో విద్యార్థుల అవస్థలు

చలికాలం వచ్చేసింది. కప్పుకుందామంటే సరైన దుప్పట్లు లేవు. ఎక్కడా మంచాలు లేవు. అందరూ నేలమీదే శయనించాలి. ఎలాగోలా సర్దుకుపోతున్నా, దోమల మోతతో విద్యార్థులు సరిగా కునుకు తీయలేకపోతున్నారు. నిద్ర చాలక ఉదయం వేళ అలసటగా ఉందని వాపోతున్నారు. కిటికీలకు ఎక్కడా సరైన మెష్‌లు లేవు. ఉన్నచోటా చినిగిపోయాయి. పేద విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన వసతిగృహాల్లో కనిపించిన దృశ్యాలివి. మచిలీపట్నం నగరంతో పాటు పెడన పురపాలిక పరిధిలోని వసతిగృహాలను గురువారం రాత్రి 'న్యూస్‌టుడే' బృందం పరిశీలించింది. అక్కడ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులే దీనికి నిదర్శనం.



మల్కాపట్నం సాంఘిక సంక్షేమశాఖ సమీకృత వసతిగృహంలో నిద్రిస్తున్న విద్యార్థులు

పరిశీలన



ప్రాంగణంలో మురుగు తిష్ఠ

మొత్తం విద్యార్థులు 145



కిటికీలకు చెదలు

మల్కాపట్నం సాంఘిక సంక్షేమశాఖ సమీకృత వసతిగృహంలో కిటికీల మెష్‌లన్నీ పాడైపోయాయి. పలు గదుల్లో కిటికీలకు చెదలు పట్టి రంధ్రాలు పడ్డాయి. ప్రాంగణం మెరక చేయకపోవడంతో చుట్టూ మురుగునీరు తిష్ఠ వేసింది. రాత్రిపూట దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి స్థాయిలో ప్రహరీ లేదు. వసతిగృహం ఎదుట దీపాలు లేక చీకటిగా ఉంది.



పాడైపోయిన కిటికీలు



పాడైన వాష్‌బేసిన్ల పైపులు

పోతేపల్లి సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల విద్యార్థుల వసతిగృహ భవనంలో శిథిలావస్థకు చేరింది. గదులు పెచ్చులూడి కనిపిస్తున్నాయి. కొన్ని కిటికీలు పగిలి ఉన్నాయి. వాష్ బేసిన్ల నుంచి నీరు వెళ్లే పైపులు పాడయ్యాయి. వసతిగృహం ఆవరణ అధ్వానంగా ఉంది.

మొత్తం విద్యార్థులు 160

రైల్వేస్టేషన్ సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో కిటికీలకు మెష్‌లు పాడైపోయాయి. భవనం పక్కనే ఓ శిథిల భవనం ఉండడం, మధ్యలో ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు భయపడుతున్నారు. వైకాపా హయాంలో నూతన భవనానికి రూ.3కోట్లు కేటాయించామని ప్రకటించారే కానీ పనులు చేపట్టలేదు.

మొత్తం విద్యార్థులు 90



వసతిగృహం వెనుక దీపాల్లేక చీకటిగా..

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి



మా వసతిగృహంలో చిన్న చిన్న సమస్యల్లో ఇటీవల కొన్ని పరిష్కరించారు. తాగునీరు బయట నుంచి తెచ్చి ఇస్తున్నారు. ప్రాంగణంలోనే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. భవనం పక్కన ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు మొలిచాయి. దానిని క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి చేయాలి. **- సాయిప్రణీత్, సాంఘిక సంక్షేమ వసతి గృహం-2 విద్యార్థి**



ఐరన్ మంచాలు మూలకు



పైకప్పు కారుతూ..



మంచాలు, దుప్పట్లు లేక నేలపైనే నిద్ర

పెడనలోని బీసీ కళాశాల విద్యార్థుల హాస్టల్ ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న 42 మంది విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ దీనిని ఏర్పాటు చేసింది. హాస్టల్ వాష్‌రూంలకు తలుపులు లేవు. విద్యార్థులు దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కరించాలని కోరుతున్నా స్పందన లేదు. ★ హాస్టల్‌లో ఇనుప మంచాలు ఉన్నా గదులు చాలవని మూలకు చేర్చారు. ★ కిటికీలకు మెష్‌లు లేక దోమల బెడద పెరిగింది. ★విద్యార్థులకు దుప్పట్ల సరఫరా జరగలేదు. కొంత మంది సొంతంగా తెచ్చుకుని నేలపై పడుకుంటున్నారు.



దోమల మెష్‌లకు చిల్లులు

– న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్, పెడన

అమరావతి రైల్వే ప్రాజెక్టు రాష్ట్ర పురోభివృద్ధికి దోహదం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: అమరావతి రైల్వే ప్రాజెక్టు రాష్ట్ర పురోభివృద్ధికి దోహదపడుతుందని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. రూ.2,245 కోట్లతో రైల్వేలైను నిర్మించడానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదించడం శుభపరిణామమన్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులకు కొత్త రైలు మార్గం అనుసంధానంగా ఉంటుందని, రైలుమార్గం వెంబడి పారిశ్రామిక పురోగతితో పాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. బహుముఖ ప్రయోజనం కలిగిన రైలుమార్గం ఏర్పాటుకు కృషి చేసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు.

అన్ని ప్రాంతాలూ ప్రగతి బాటలో..

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: అమరావతి రైల్వేలైనుతో అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. నగరంలోని తెదేపా నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అమరావతి రైల్వేలైన్ మచిలీపట్నం పోర్టుకు అనుసంధానించడం ద్వారా బందరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రగతి పథంలో పయనిస్తాయన్నారు. కూటమి నాయకులు ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, వీపీ ఫణికుమార్, వాటపల్లి రాము, విన్నకోట సుబ్బారావు, తదితరులు అమరావతి రైల్వే లైను ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రహ్మపురంలో చెత్తకుప్పలు



భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: స్థానిక బ్రహ్మపురంలోని వీధిలో చెత్త గుట్టలుగా పేరుకుంది. కార్పొరేషన్ సిబ్బంది రోజుల తరబడి చెత్త తొలగించటం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. కలెక్టరేట్ రోడ్‌కు అత్యంత సమీపంలోని వీధిలోనే చెత్త గుట్టలుగా పేరుకుపోవటం ఆశ్చర్యంగా ఉంది. జిల్లా అధికారులు సంచరించే ప్రాంతం కూడా ఈ విధంగా ఉండటం కార్పొరేషన్ సిబ్బంది పనితీరును నిదర్శనంగా ఉందని వ్యాఖ్యలు వినబడుతున్నాయి. గతంలో కూడా పత్రికలలో వార్తలు వచ్చినపుడే మాత్రమే చెత్తను తొలగించారని, చెత్తను ఏరోజుకు ఆ రోజు తొలగించాలని కోరుతున్నారు.

పోటీతత్వంతో ఉత్తమ ఫలితాలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రతిభ చాటుకునేందుకు నిర్వహించే పరీక్షల వల్ల పోటీతత్వం అలవడుతుందని, అది చదువులో ఉత్తమ ఫలితాలు సాధనకు దోహదపడుతుందని నగరంలోని ఇ.కె.బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ సీహెచ్ సూర్యనారాయణరాజు అన్నారు. పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో డి.చతుష్ఠా (9వ తరగతి), కె.లోహిత్ నాథ్ (10వ తరగతి), పి.వైష్ణవి (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు కరస్పాండెంట్ సూర్యనారాయణరాజు, ప్రిన్సిపల్ సీహెచ్ సాయిఫణీంద్ర, హెచ్‌ఎం కె. ఫణికుమారిలు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కె.ప్రసన్న, ఎండీ అబ్దుల్లా పాల్గొన్నారు.



విజేతలతో కరస్పాండెంట్ సూర్యనారాయణరాజు, ప్రిన్సిపల్ ఫణీంద్ర, హెచ్‌ఎం ఫణికుమారి



వ్యాసం రాస్తున్న విద్యార్థులు

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మండలంలోని జాతీయ రహదారి పరిధిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకొంటున్నట్లు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేయడంతో పాటు పరిసరాలను పరిశీలించారు. తొలుత ఎస్సై గణేష్‌కుమార్, సిబ్బంది ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. పెడన రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: నకిలీ బంగారు బిస్కెట్ తనఖాగా పెట్టి ర్యాపిడో బైక్‌ను ఎత్తుకెళ్లిన ఘరానా మోసగాన్ని సూర్యాపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ ఛీజిజిల్లా మచిలీపట్నం గొడుగు పేట గ్రామానికి చెందిన విన్నకోట సాయికుమార్ ఆగస్టు 7న ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాలని నిర్ణయించుకొని హనుమకొండ నుంచి జనగామ వరకు ర్యాపిడో ద్విచక్ర వాహనాన్ని ఆన్‌లైన్లో బుక్ చేసుకున్నాడు. అనంతరం జనగామ నుంచి సూర్యాపేట వరకు తీసుకెళ్లాలని. అదనంగా రూ.వెయ్యి చెల్లిస్తానని అంగీకారం కుదుర్చుకున్నాడు. సూర్యాపేట పట్టణంలోని కొత్తబస్టాండు వద్దకు వచ్చిన తర్వాత తనకు వ్యక్తిగతంగా పని ఉందని.. ద్విచక్ర వాహనం కొద్ది సేపు ఇవ్వాలని కోరాడు. ర్యాపిడో డ్రైవర్ అంగీకరించకపోవడంతో నకిలీ బంగారు బిస్కెట్‌ను తనఖాగా పెట్టి వాహనాన్ని తీసుకొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు నిందితుడు సాయి కుమార్ శుక్రవారం సూర్యాపేటలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్టు చేశారు. ఇతనిపై ఆంధ్రప్రదేశ్‌లోని పలు ఛీజిజిల్లాల్లో ఓఎల్‌ఎక్స్‌లో పెట్టిన సుమారు యాభై ద్విచక్ర వాహనాలను మాయమాటలతో దొంగతనం చేసిన కేసులు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి కృషి చేసిన ఎస్సైలు కె.గోపికృష్ణ, కుశలవ, హెడ్ కానిస్టేబుల్‌లు కరుణాకర్, కృష్ణ, సైదులు, కానిస్టేబుల్‌లు శివ, మధును ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

రూ.20 లక్షలతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణం

లక్ష్మీపురం (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మండలంలోని ప్రతి గ్రామంలో మట్టి రోడ్లు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల తెదేపా అధ్యక్షుడు ఒడుగు తులసీరావు అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో నాలుగు రోడ్ల నిర్మాణానికి తులసీరావు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మొత్తం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో ఈ నాలుగు రోడ్లు నిర్మిస్తున్నట్లు తులసీరావు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా గ్రామ అధ్యక్షుడు నాగభూషణం, జనసేన గ్రామ అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న తెదేపా మండల అధ్యక్షుడు తులసీరావు, కూటమి నాయకులు

ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు చర్యలు

పెడన, న్యూస్‌టుడే: మున్సిపల్ ప్రజారోగ్య కార్మికుల రక్షణకు చర్యలు తీసుకొంటున్నామని కమిషనర్ గోపాలరావు తెలిపారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న 54 మంది ప్రజారోగ్య కార్మికులకు హ్యాండ్ గ్లౌజులు, బూట్లు, మాస్కులు, యాప్రాన్, తదితర రక్షణ పరికరాలను శుక్రవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కటకం ప్రసాద్, మాజీ వైస్ ఛైర్మన్ రెహమాన్‌బేగ్, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికోన్నతికి పథకాలు ఊతం



మెప్మా బజారులో ఉత్పత్తులు పరిశీలిస్తున్న కమిషనర్, ప్రజాప్రతినిధులు

పెడన, న్యూస్‌టుడే: మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెప్మాబజార్‌ను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. మాజీ వైస్‌ఛైర్మన్ రెహమాన్ బేగ్, కౌన్సిలర్ కటకం ప్రసాద్, పట్టణ తెదేపా అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కోమట్ల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా సేవలు



కేకు కోస్తున్న మేనేజర్ తదితరులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని కెనరా బ్యాంకు మేనేజర్ దినేష్ అస్మత్ అన్నారు. నగరంలోని కెనరా బ్యాంకు ఆర్టీసీ రోడ్డు బ్రాంచి 10వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 3వేల మందికి పైగా ఖాతాదారులతో రూ.72కోట్ల టర్నోవర్‌తో నడుస్తుందంటే ఖాతాదారులే కారణమన్నారు. సమావేశంలో భాగంగా ఉత్తమ ఖాతాదారులను సత్కరించారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులతో కలిసి కేకు కత్తిరించి వేడుకలు నిర్వహించారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న క్లబ్ సభ్యులు, ముస్లింలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని వర్రేగూడెంలో వైజ్‌మెన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్యార్మీ షరీఫ్ వేడుకలు నిర్వహించారు. క్లబ్ సభ్యులతో పాటు స్థానిక ముస్లింలు మెహబూబ్‌సుభానీ జెండా వద్ద ప్రార్థనలు చేశారు. వైజ్‌మెన్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ పీర్ కార్యక్రమ ప్రత్యేకత వివరించారు. డా.నాగలింగం నాగేశ్వరరావు, సభ్యులు సయ్యద్‌బాజీ, షేర్‌అలీ, ఇస్మాయిల్, సుబ్బారావు, నితిన్, షారుక్ పాల్గొన్నారు.

ఫైలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గూడూరు, న్యూస్‌టుడే: ఫైలేరియాపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి మురళీ అన్నారు. ఫైలేరియా నివారణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో రక్త పరీక్షలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని రాయవరం గ్రామంలో పర్యటించి ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించారు. మల్లవోలు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రాము, బాబూరావు, భార్గవి, లక్ష్మి, సుబ్రహ్మణ్యం, రాజాహరిగోపాల్, ప్రవీణ్‌కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడక!

17 నెలలుగా ప్రారంభం కాని పోర్టు అనుబంధ రోడ్డు పనులు

న్యూస్‌టుడే, మచిలీపట్నంరూరల్

మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా నిర్మాణం కావాల్సిన రోడ్ కం రైల్ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పోర్టుకు శంకుస్థాపన జరిగి 17 నెలలు గడచినా రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పోర్టుకు అనుబంధంగా రోడ్ కం రైల్ రహదారికి మచిలీపట్నం-పెడన మార్గంలో హర్ష కాలేజి వద్ద నుంచి పోతేపల్లి, పోతిరెడ్డిపాలెం, గోపువానిపాలెం, కరఅగ్రహారం, చిలకలపూడి మీదుగా మార్గం ఖరారు చేశారు. ఇందుకోసం నాలుగు గ్రామాలకు చెందిన 244 మంది రైతుల నుంచి 121.92 ఎకరాలు సేకరించేందుకు నిర్ణయించారు. వారిలో 180 మందికి చెందిన 98 ఎకరాలకు రూ.44.5 కోట్లు చెల్లించారు. బేసిక్ ధరను ఎకరానికి రూ.22 లక్షలుగా నిర్ణయించి ఇందుకు రెండున్నర రెట్లు నష్టపరిహారంగా రూ.55లక్షలను, అడిషనల్ వాల్యూగా మరో రూ.2లక్షలను కలిపి ఎకరానికి గరిష్ఠంగా రూ.57లక్షలు చెల్లించారు.

తలనొప్పిగా 18 శాతం భూసేకరణ

ఇప్పటికి 82 శాతం భూసేకరణ పూర్తయినా మిగిలిన 18శాతం భూములను సేకరించటం అధికారులకు తలనొప్పిగా మారింది. కోర్టు కేసులు, సర్వే నంబర్లలో తేడాలు, కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు, పరిహారం తక్కువగా ఇస్తున్నారనే కారణాలతో రైతులు భూములను ఇవ్వడం లేదు. భూసేకరణకు మూడు అవార్డులు పాస్ చేశారు. గోపువానిపాలెం, కరఅగ్రహారం, పోతేపల్లి, చిలకలపూడి గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించి 2023 ఫిబ్రవరి 21న 1వ అవార్డు, పోతేపల్లి గ్రామానికి చెందిన రైతుల నుంచి భూములు సేకరించేందుకు 2023 ఆగస్టు 8న రెండో అవార్డు, పోతేపల్లి భూముల విషయంలో 2023 డిసెంబర్ 20న మూడో అవార్డు పాస్ చేశారు. కొందరు రైతులు నష్టపరిహారం ఎకరానికి రూ.కోటి కావాలని భీష్మించుకుని కూర్చున్నారు. అధికారులు నష్టపరిహారం తీసుకోవాలని ఎన్నిసార్లు కోరినా స్పందించడం లేదు.



ఈ పొలాల నుంచే రహదారి వెళ్లేది

వీటిని అధిగమించాలి..

★ రోడ్ కం రైల్ రహదారి నిర్మాణం వ్యయం ఎక్కువగా ఉండడంతో దీనిని జాతీయ రహదారుల సంస్థకు అప్పగించేందుకు ఉన్నత స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారుల సంస్థ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టేందుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు అధికారులు చెప్పారు.

★ రోడ్ కం రైల్ రహదారి భూముల కోర్టు సమస్యల పరిష్కారానికి విజయవాడలో ట్రిబ్యునల్ ఏర్పాటైంది. రైతులు తమ సమస్యలను ట్రిబ్యునల్‌లో వినిపించవచ్చు.

★ డిసెంబరులో భూములు స్వాధీనం చేసుకుని రహదారి నిర్మాణం ప్రారంభించాలి. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

విద్యార్థుల ప్రతిభకు పదును



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్

పోరంకి, న్యూస్‌టుడే: పోరంకి చిగురుపాటి శ్రీ కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్‌లో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్. దివ్య (9), పి. కీర్తన (9), డి. యోగేష్ (8), ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ కె. మాధవి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఫెసిలిటేటర్ డి. రేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.లక్షతో ఎమ్మెల్యే బోడే తెదేపా శాశ్వత సభ్యత్వం

పెనమలూరు, న్యూస్‌టుడే : పెనమలూరు నియోజకవర్గంలో శనివారం నుంచి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ రూ.లక్షతో పార్టీ శాశ్వత సభ్యత్వం స్వీకరించనున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 32 మంది అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.26 లక్షల చెక్కులను అందజేయనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

? ఉంగుటూరు మండలం తేలప్రోలులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు చెప్పినా కనీసం పట్టించుకోవడం లేదు. **-మనోజ్, తేలప్రోలు**

✔ సత్వరమే కార్యదర్శితో మాట్లాడి పరిసరాల శుభ్రతపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తాం. **-సత్యకుమార్, ఎంపీడీవో**

–న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

? వీరవల్లిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. రహదారుల పైకి మురుగు ప్రవహిస్తోంది. దీని వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. **-ఆంజనేయులు, వీరవల్లి**

✔ఈ సమస్యపై తగు చర్యలు తీసుకుంటాం.

-శ్యామలరావు, పంచాయతీ ఈవో

? ఎనికేపాడు కొడాలి వారి వీధిలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **-స్థానికులు**

✔ దీపాలకు మరమ్మతులు చేసి సత్వరమే పునరుద్ధరిస్తాం.

-పంచాయతీ కార్యదర్శి, -న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

? పోరంకి మహాలక్ష్మీనగర్ 5వ రోడ్డులో ఖాళీ స్థలాల్లో డ్రైనేజీ నీరు వదులుతున్నారు. దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

? కానూరు, పోరంకి పరిసర ప్రాంతాల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. అధికారులు వాటిని వేరేప్రాంతాలకు తరలించాలి.

- శోభన్, కానూరు

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

పై ప్రశ్నలకు తాడిగడప పురపాలక సంఘం కమిషనర్ భవానీప్రసాద్ సమాధానమిచ్చారు. – న్యూస్‌టుడే, కానూరు

పట్టభద్రుల కోసం ప్రత్యేక శిబిరం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పట్టభద్రులంతా తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలని, వారి కోసం ఓటు నమోదు శిబిరం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి కల్యాణి పేర్కొన్నారు. త్వరలో జరగబోయే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే పట్టభద్రులంతా కొత్తగా తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. శుక్రవారం హనుమాన్‌జంక్షన్‌లో తన నివాసంలో ఏర్పాటు చేసిన శిబిరంలో స్థానిక తెదేపా నాయకులతో కలిసి దరఖాస్తు ఫారాలు పూర్తి చేశారు. నాయకులు అట్లూరి శ్రీను, గార్లపాటి రాజేశ్వరరావు, ఆర్నేపల్లి వెంకటేశ్వరరావు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణానికి పూర్వ విద్యార్థుల చేయూత

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం ముస్తాబాద జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 1985-86లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కళావేదిక నిర్మించనున్నారు. రూ.5 లక్షల వ్యయంతో కళావేదిక నిర్మాణానికి ప్రధానోపాధ్యాయుడు వెంకట రామ్‌గోపాల్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. పాఠశాలలకు పూర్వ విద్యార్థులు తరగతి సంపదని.. వారి స్ఫూర్తితో నేటి విద్యార్థులు ఉన్నతంగా చదివి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కందిమళ్ల శ్రీనివాసరావు, చిన్ని, ఎన్.శ్రీనివాసరావు, చిమట ఏడుకొండలు, లక్ష్మి, ప్రకాశ్, సర్పంచి రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు మున్ని, విద్యా కమిటీ ఛైర్మన్ ముస్తఫా వలీ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా శనివారం శేరీనరసన్నపాలెంలో గ్రామసభ నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వి.నాగభూషణం తెలిపారు. పొరపాట్లు, సమస్యలు ఉన్న రైతులు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సమస్యల వలయంలో

వసతి గృహాలు

పరిశీలన



గన్నవరం: దావాజీగూడెంలో సరిపడా గదులు లేక మెట్లపై బక్కెట్లు

గన్నవరం గ్రామీణం, పెనమలూరు, హనుమాన్‌జంక్షన్, ఉయ్యూరు, న్యూస్‌టుడే

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే గన్నవరం, పెనమలూరు నియోజకవర్గంలోని బాలుర, బాలికల ప్రభుత్వ వసతి గృహాలను 'ఈనాడు-ఈటీవీ' గురువారం రాత్రి పరిశీలించింది. పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ బాలబాలికల వసతి గృహాలు మరింత అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం కనీస సదుపాయాలను కల్పించడంలో నిర్లక్ష్యం కారణంగా నేడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శీతకాలం వచ్చినా దుప్పట్లు, కిటికీల మరమ్మతులు, వాటికి మెష్‌లు ఏర్పాటు చేయకపోవడంతో దోమల బెడద కారణంగా అనారోగ్యాలు పాలవుతున్నామని వాపోయారు.

✦ మరోవైపు విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదులు లేకపోవడంతో ఉన్న అరకొర గదుల్లోనే నిద్రించాల్సిన దుస్థితి నెలకొంది. వార్డెన్లు ఎప్పుడు ఉంటారో.. ఎప్పుడు వెళ్తారో తెలియదని.. సాయంత్రం ట్యూటర్ల సమయపాలన లేకుండా ఇష్టారాజ్యంగా వస్తుంటారని పలువురు విద్యార్థులు తెలిపారు.



గన్నవరం: సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో విద్యార్థుల మధ్య ప్రమాదకరంగా విద్యుత్తు మోటారు ఇలా..

✦ బాపులపాడు మండలం రేమల్లెలోని బీసీ బాలుర వసతి గృహాన్ని 'న్యూస్‌టుడే' సందర్శించగా, శుక్రవారం దుప్పట్లు వచ్చాయని, గత నాలుగేళ్ల నుంచి దుప్పట్లు అందలేదంటూ విద్యార్థులు వాపోయారు. మరోవైపు ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎస్సీ వసతి గృహాలను ఆనుకొని ఉండే బీసీ వసతి గృహాలు మూత పడడం గమనార్హం.

✦ పెనమలూరులోని గోగులమ్మ డొంకలో ఉన్న ఈ వసతి గృహం గ్రామానికి వెలుపల ఉండడం, ఈ ప్రాంతాలు నిర్మానుష్య ప్రాంతాలు కావడంతో మందుబాబులు ఆటోలు, ద్విచక్రవాహనాలపై ఇక్కడకు చేరుకొని ఘర్షణలు, గొడవలకు దిగుతుండడంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు.



ఆరు బయట డబ్బాల్లో పట్టిన తాగునీరు



గన్నవరం: దావాజీగూడెంలో రాత్రులు ఇలా..



ఉయ్యూరులోని బాలుర ఎస్టీ గురుకుల పాఠశాల వసతి గృహంలో నేలపైనే పడక



హనుమాన్‌జంక్షన్: రెండ్రోజుల కిందట పంపిణీ చేసిన దుప్పట్లతో రేమల్లె బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులు

రహదారుల నిర్మాణ పనులు ప్రారంభం



హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చి రాగానే కూటమి ప్రభుత్వం అభివృద్ధి పరుగులు పెట్టిస్తుందని, గత అయిదేళ్లలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో రూ.20 కోట్ల వ్యయంతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ప్రహరీల నిర్మాణానికి కార్యాచరణ చేపట్టడం ఆనందంగా ఉందని రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వేలేరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మండల పరిషత్తు నిధులు రూ.85 లక్షల వ్యయంతో చేపట్టిన నాలుగు రహదార్ల నిర్మాణ పనుల్ని శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో తమ గ్రామంలో కూటమి ఏర్పడిన మూడు నెలల్లోనే దాదాపు రూ.2 కోట్ల పైచిలుకు నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు సురేష్, భవానీశంకర్, సీతారామస్వామి, సత్యనారాయణ, సురేష్, శివనాగమల్లేశ్వరరావు, కాశేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.50 వేల వితరణ

ఉయ్యూరు, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు శుక్రవారం అందించారు. వరద బాధితులకు రూ.1.19 లక్షల విలువైన దుస్తుల్ని కూడా అందజేశామని వాకర్స్ అధ్యక్షుడు షేక్ సత్తార్ తెలిపారు. గౌరవాధ్యక్షుడు నూకల సాంబశివరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కుచెక్కు అందిస్తున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్తార్, ప్రతినిధులు సాంబశివరావు తదితరులు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

చినపులిపాక(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. చినపులిపాకలో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీ వ్యవస్థను నాశనం చేసి, గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, తెదేపా బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, సర్పంచి ఆరేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కాటూరు(ఉయ్యూరుగ్రామీణం), న్యూస్‌టుడే : కాటూరు విద్యుత్తు ఉప కేంద్రం నిర్వహణ, మరమ్మతులు నేపథ్యంలో కాటూరు, రాజుపేట, కడవకొల్లు, పొట్లపాడు, వీరవల్లి మోఖాసా, కలవపాముల గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోరంకి, న్యూస్‌టుడే : కానూరు 11 కేవీ సెక్షన్ పరిధిలో సనత్‌నగర్, తులసీ నగర్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు గుణదల ఈఈ పి.హరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీ కాలనీ, సనత్‌నగర్, తులసీ నగర్ ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం మండలం పురుషోత్తపట్నం 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా పలుచోట్ల శనివారం సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రాజు తెలిపారు. ఫలితంగా కొండపావులూరు, పురుషోత్తపట్నం పంచాయతీల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. వ్యవసాయ వినియోగదారులకు ఉదయం 5 నుంచి 8 గంటల మధ్య, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

ఏపీ యూటీఎఫ్ మండల సమావేశం నేడు

పోరంకి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీ యూటీఎఫ్) పెనమలూరు మండల జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల శాఖ కన్వీనర్ ఆర్.షరీఫ్, నాయకులు బి.వెంకటేశ్వరరావు, టి.సీతారామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు కానూరులోని కృష్ణనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమావేశం ఉంటుందన్నారు.

రక్షక సేవలపై అవగాహన

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం కేసరపల్లిలో మేధా టవర్స్ ఆవరణలోని మహిళా ఐటీ ఉద్యోగినులకు రక్షక సేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇటీవల స్థానిక హైవే నుంచి ఐటీ పార్క్ పరిసరాల్లో కొందరు ఆకతాయిలు మహిళా ఉద్యోగినులను హేళన చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందాయి. ఈనేపథ్యంలో ఉద్యోగినుల భద్రతపై సీఐ శివప్రసాద్ భరోసా కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైతే పోలీస్ స్టేషన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

కబడ్డీ విజేత ఎస్ఆర్‌కే కళాశాల

కంచికచర్ల, న్యూస్‌టుడే: స్థానిక మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూ (కాకినాడ) సెంట్రల్ జోన్ కబడ్డీ టోర్నమెంటులో ఎనికేపాడులోని ఎస్ఆర్‌కే కళాశాల జట్టు విజయం సాధించింది. నందిగామ ఏసీపీ రవికిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను తిలకించి విజేతలను అభినందించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

తేలప్రోలు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామా ఇంజినీరింగ్ కళాశాలలో రొమ్ము క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్, గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య నిపుణురాలు డా. అనీలా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ వ్యాధి సోకేందుకు గల కారణాలు, నివారణ, రోగ నిర్ధారణ, చికిత్స ఇతర విషయాలపై అధ్యాపకులు, విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపల్ డా. జీవీకేఎస్‌వీ ప్రసాద్, డా. రెబ్బాభార్గవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డా అనీలా

ప్రొద్దుటూరు (కంకిపాడు), న్యూస్‌టుడే : క్యాన్సర్ మహమ్మారిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని లయన్స్ క్లబ్ జిల్లా సమన్వయకర్త బొబ్బా హరనాథ్ బాబు సూచించారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొద్దుటూరు జడ్పీ ఉన్నత పాఠశాల్లో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మద్దుల గోవిందరావు, కంకిపాటి నాగమల్లేశ్వరరావు, హెచ్ఎం అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో ఎటు చూసినా వ్యర్థాలే

దర్పణం



రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో ఇలా..

గన్నవరంలో ఏ వీధిలో చూసిన కుప్పలుగా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. చెత్త తొలగించండి మహాప్రభో అని నివాసితులు మొత్తుకున్నా.. పంచాయతీ కార్యాలయ సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ పట్టణంలో సుమారు మూడు టన్నుల చెత్త వస్తుండగా కేవలం అరకొరగా గ్రామ పెద్దలున్న కాలనీల్లో తొలగించడం తప్ప ఇతర ప్రాంతాల్లో కనీసం పట్టించుకోవడం వాపోతున్నారు. ప్రధానంగా బాలుర జడ్పీ క్రీడా మైదానం, ఎస్టీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రం, గొంది ఆసుపత్రి పరిసరాల్లో వీధులను శుభ్రం చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిసరాల శుభ్రతతో ప్రజారోగ్యాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

ఉత్తమ ఫలితాలతోనే గుర్తింపు

కాటూరు (ఉయ్యూరుగ్రామీణం), న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలలో గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించిన 22 మంది ఉపాధ్యాయులకు డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర శాఖకు అనుబంధంగా ఉన్న ఉపాధ్యాయ సేవా దళ్ ఆధ్వర్యంలో కాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలతోనే ఉపాధ్యాయులకు సమాజం, ఉన్నత అధికారుల దగ్గర గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షుడు జీవీఎస్ పెరుమాళ్లు, రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో శ్రీను తదితరులు

రైఫిల్ షూటింగ్ పోటీల్లో బంగారు పతకం



కె.అభిలాష్‌చంద్రతో సుబ్రమణ్యం

కానూరు, న్యూస్‌టుడే : అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ అండర్-14 బాలుర విభాగంలో పోరంకికి చెందిన కె.అభిలాష్ చంద్ర బంగారు పతకం సాధించారు. కృష్ణాజిల్లా తరపున మొదటి స్థానంలో నిలిచి ప్రతిభ చాటాడు. ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ కోచ్ సుబ్రమణ్యం చేతుల మీదుగా శుక్రవారం పతకం అందుకున్నారు.

బాణసంచా దుకాణం ఏర్పాటుపై వివాదం

కంకిపాడు, న్యూస్‌టుడే : కంకిపాడు రైతు బజార్ ఎదుట ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణంపై వివాదం నెలకొంది. ఇతర దుకాణాలకు ఊరి చివర ప్రత్యేక స్థలాన్ని కేటాయించగా.. ఈ ఒక్కటే ఎంపీపీ, జడ్పీ ఉన్నత పాఠశాలలు, రైతు బజార్ సమీపంలో పెట్టడంతో కొందరు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సదరు దుకాణంలో బాణసంచా విక్రయాన్ని తాత్కాలికంగా ఆపేశారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

కేతేపల్లి, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులో 65వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన షేక్ బాషా(34) తన అశోక్ లేలాండ్ తోలుకుంటూ ఉప్పలపహాడ్ జంక్షన్ శివారు దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

పెరికీడులో చోరీ

హనుమాన్‌జంక్షన్: పెరికీడు గ్రామంలో చోరీ జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున స్థానికుడు పుట్టి దామోదరావు ఇంటి తాళం పగలగొట్టిన దుండగులు, గ్యాస్ సిలిండరు, పొయ్యి, ఇతర సామగ్రి అపహరించుకుపోయారు. బాధితుడు కొంత కాలంగా బెంగళూరులో నివాసం ఉంటున్నారు. పెరికీడులోని ఇంటికి అప్పుడప్పుడూ వచ్చి వెళుతున్నారు. చోరీ సమాచారం తెల్సుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



డ్రైనేజీపై ఎగుడు దిగుడుగా సిమెంట్ దిమ్మెలు



డ్రైనేజీకి- రహదారికి మధ్య ప్రమాదకరంగా ఖాళీ

సమస్యలతో సతమతం

విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై అనేక సమస్యలు దర్శనమిస్తున్నాయి. రహదారికి డ్రైనేజీకి మధ్య ఖాళీ ఏర్పడింది. దీంతో దత్త దేవాలయం సర్వీస్ రోడ్డు నుంచి గండిగుంట సెంటర్‌కు వచ్చే పాదచారులు రాత్రి సమయంలో గమనించక పడిపోయి గాయాల పాలవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. గండిగుంట సెంటర్ నుంచి జాతీయ రహదారి దాటేందుకు అక్కడ ఉన్న డ్రైనేజీపై ఏర్పాటు చేసిన దిమ్మెలు ఎగుడు దిగుడుగా ఉండడంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉన్నాయి. విజయవాడ నుంచి ఉయ్యూరు వెళ్లాలంటే జాతీయ రహదారి మీద నుంచి గండిగుంట సెంటర్ వద్ద ఉన్న క్రాసింగ్ నుంచి సర్వీస్ రోడ్డులోకి రావాలి. కనీసం ఇక్కడ సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో తెలియక ముందుకు వెళ్లిపోతున్నారు. ఈ సమస్యలపై జాతీయ రహదారి విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. **గండిగుంట (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే**

గుడివాడ

•గుడివాడ •పామర్రు • అవనిగడ్డ



? పామర్రులోని యూనియన్ బ్యాంకు ముందు బజారు రోడ్డు గుంతలు పడి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. - అబ్దుల్ ఆరీఫ్, పామర్రు

✔ పంచాయతీలో నిధుల లభ్యతను బట్టి రహదారి నిర్మిస్తాం. - సలీమ్, పంచాయతీ కార్యదర్శి

? ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - అజయ్‌కుమార్, పామర్రు

✔ చెత్త తొలగించి సమస్య పరిష్కరిస్తాం. - సుధాకరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, పామర్రు

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

గుడివాడ పట్టణం, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణ పరిధిలోని విద్యుత్తు ఉప కేంద్రాలు, లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు గుడివాడ డీఈఈ జి.బి. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

డయల్ యువర్ డీఎం నేడు

అవనిగడ్డ: అవనిగడ్డ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ శనివారం ఉదయం 11.30 నుంచి 12.30 గంటల మధ్య డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు వారి ప్రయాణ అవసరాలపై సూచనలు, సలహాలు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. 9959225466 నెంబరుకు ఫోన్‌చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

అష్టలక్ష్మికి పంచామృతాభిషేకం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మీ ఆలయంలో శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దని దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, స్వర్ణపుష్పార్చన, అభిషేకం నిర్వహించారు.



విజేతలను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయిని సిస్టర్ భాగ్యమేరీ, ఉపాధ్యాయులు



వ్యాస రచన పోటీల్లో చిన్నారులు

సృజనకు పదును

‘ఈనాడు’ ఆధ్వర్యంలో గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని ఫాదర్ బియాంకీ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంతర్జాల వినియోగం, లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలైన పదో తరగతి విద్యార్థులు డి.ప్రణవ్, జి.వినీల, 9వ తరగతి విద్యార్థిని డి.స్వాతిలకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని సిస్టర్ భాగ్యమేరీ, ఉపాధ్యాయిని జ్యోత్స్న దేవి బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం

రూ.37.4 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి

గుడివాడ పట్టణం, న్యూస్‌టుడే: గుడివాడలో 20 ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక దృష్టితో పరిష్కరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక బేతవోలులో రూ.37.4 లక్షలతో చేపట్టిన ముస్లిం మైనారిటీల శ్మశాన వాటిక అభివృద్ధి పనులను తెదేపా నాయకులతో కలిసి రావి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జనసేన నియోజకవర్గ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా నాయకులు పిన్నమనేని బాబ్జి, ముళ్లపూడి రమేష్, కామేపల్లి తులసిబాబు, చేకూరు జగన్‌మోహన్‌రావు, వాసే మురళీ, గురువులు నవీద్ ఆలం, ఖలీల్ రెహ్మాన్, మస్జీద్ ఎ మహ్మదీయ కమిటీ నాయకులు అమీర్ బాషా, బాబావలీ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో మాజీ ఎమ్మెల్యే రావి, తెదేపా నాయకులు

సిబ్బందికి సత్కారం

కపిలేశ్వరపురం(పమిడిముక్కల): కపిలేశ్వరపురం పంచాయతీ కార్యాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన సిబ్బందిని పాలకవర్గం శుక్రవారం సన్మానించింది. సన్మానితుల్లో కార్యదర్శి మండవ సోమ విద్యాధర్, సహాయకుడు షేక్‌నాగూర్‌మీరా, సర్వేయరు బొప్పన ప్రత్యూష, బిల్‌కలెక్టరు వెంకటరమణ, వీఆర్వో శీలం నరసింహారావు, సిబ్బంది చిన్నం నాగేశ్వరరావు ఉన్నారు. సర్పంచి బుల్లా నాగమణి, ఉపసర్పంచి గూడూరు శివరామకృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కంచర్ల అంకకుమారి, మరీదు రాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ వీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రాజనీతిశాస్త్రం ఆధ్వర్యంలో బీఏ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అధ్యాపకుడు డాక్టర్ ఎం.సుందరరావు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగానికి సంబంధించిన మౌలిక అంశాలపై అవగాహన కల్పించారు. విజేతలైన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందించారు.



గుడ్‌మెన్‌పేట కళాశాల బాలుర వసతిగృహంలో నేలపై వారి బొంతలు వేసుకొని పడుకున్నారిలా..



మొవ్వలో పెచ్చులూడి పడుతున్న భోజన శాల



పెదపారుపూడి : బీసీ వసతి గృహంలో..



మెష్ లేకుండా పగిలిన కిటికీలు



అవనిగడ్డ గ్రామీణం : పులిగడ్డ గురుకులంలో అయిదేళ్లుగా అసంపూర్తిగా భవన నిర్మాణం..

వసతుల్లేని గృహాలు

నేలపైనే నిద్ర ● చలిలో వణుకుతున్న విద్యార్థులు ● సంక్షేమానికి దూరంగా వసతి గృహాలు

న్యూస్‌టుడే, గుడివాడ పట్టణం, అవనిగడ్డ, అవనిగడ్డ గ్రామీణం, చల్లపల్లి, మోపిదేవి, పామర్రు గ్రామణం, పెదపారుపూడి, కూచిపూడి: విద్య కోసం రూ.కోట్లలో ఖర్చు చేశామని బీరాలు పలికిన గత వైకాపా సర్కారు సంక్షేమ వసతిగృహాలను గాలికి వదిలేసింది. దీంతో పేద విద్యార్థుల చదువు, వసతి గృహాలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎక్కడ చూసినా లెక్కకు మించి సమస్యలు తాండవిస్తున్నాయి. విద్యార్థులకు దుప్పట్లు, కార్పెట్లు సరఫరా చేయకపోవడంతో నేలపైనే చలికి వణుకుతూ నిద్రిస్తున్నారు. నాలుగేళ్ల నుంచి కాస్మొటిక్ ఛార్జీలు రావడం లేదని బాలలు వాపోతున్నారు. మెనూకు సరిపడా నగదు సక్రమంగా అందక నాణ్యమైన భోజనానికి నోచుకోవడం లేదు. కిటికీల మెష్‌లు చిరిగిపోవడం, ఊడిపోవడంతో గదుల్లో దోమలు, బల్లులు సంచరిస్తున్నాయి. దీని వలన తరచూ విద్యార్థులు జ్వరం బారిన పడుతున్నారు. పలు చోట్ల తాగునీరు బయట నుంచి తెచ్చుకుంటున్నారు. ఒకే సమయంలో ఎక్కువ మంది విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి అవస్థలు పడుతున్నారు. దుస్తులు ఉతుక్కోవడానికి కూడా నీటి కష్టాలు అనుభవిస్తున్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లకు తలుపులు, విద్యుత్తు సౌకర్యం లేదు. నిర్వహణ కొరవడి దుర్వాసన వెదజల్లుతోంది. మరికొన్ని చోట్ల పైకప్పులు పెచ్చులూడిపోయి వర్షానికి కారిపోతూ గదుల్లోకి నీరు చేరుతోంది. గోడలు బీటలు వారి భవనాలు శిథిలావస్థకు చేరాయి. చెప్పుకోలేని ఇబ్బందులతో విద్యార్థులు సతమతమవుతున్నారు. వివిధ సంక్షేమ వసతి గృహాల్లో అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గురువారం రాత్రి ‘న్యూస్‌టుడే’ క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా వెలుగు చూసిన అసౌకర్యాలపై పరిశీలనాత్మక సచిత్ర కథనం.

న్యూస్‌టుడే పరిశీలన

● పామర్రు మండలం నిమ్మకూరు గురుకుల పాఠశాల పాఠశాలలో 462(బాలికలు 230, బాలురు 232) మంది విద్యార్థులున్నారు. వేర్వేరు వసతి గృహాల్లో బాలికలకు 9, బాలురకు 16 గదులున్నాయి. పైకప్పు పాడై వర్షపునీరు కారుతుండగా గోడలు శిథిలావస్థకు చేరాయి. కొన్ని గదులకు విద్యుత్తు ఎర్త్ వస్తోంది. కిటికీలకు రెక్కలు ఊడిపోగా, ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది విద్యార్థులు చాపలపై పడుకుంటున్నారు. ● పులిగడ్డ గురుకులంలో 465 మంది విద్యార్థులుండగా వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో బిక్కుబిక్కుమంటూ చదువుల బండి నెట్టుకొస్తున్నారు. వాన కురిస్తే చిత్తడే చిత్తడి.



చల్లపల్లి : అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర వసతిగృహంలో బొంతలపై నిద్రిస్తూ..



మోపిదేవి : అద్దె భవనంలో దుప్పట్లు, కార్పెట్లు లేకుండా నేలపైనే నిద్ర



గుడివాడ పట్టణం : ఇంటి నుంచి తెచ్చుకున్న బొంతలు వేసుకొని చదువుకుంటూ..



మెష్ లేకుండా గుడ్లవల్లేరు వసతి గృహం కిటికీ



నిమ్మకూరు : నేలపై చాపలు వేసుకొని నిద్రిస్తున్న విద్యార్థులు



మొవ్వ : తలుపులు విరిగి, విద్యుత్తు సౌకర్యం లేకుండా స్నానపు గదులు



పెదపారుపూడి బీసీ వసతి గృహంలో తలుపులు లేకుండా..



పెదపారుపూడి: బాత్‌రూమ్స్‌కి ఊడిపోయిన తలుపులు



అవనిగడ్డ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో దుప్పట్లు లేకుండా నిద్రిస్తున్న బాలురు

కార్యకర్తలకు అండగా ఉంటా: కనపర్తి

చల్లపల్లి, న్యూస్‌టుడే: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులో తెదేపా మండల సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి జరిగే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఇసుక సమస్యను పలువురు ప్రస్తావించగా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. తొలుత శ్రీనివాసరావును పలువురు తెదేపా నాయకులు పూలదండలు, శాలువాలతో సత్కరించారు. తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

కొడాలి (ఘంటసాల), న్యూస్‌టుడే: తెదేపా అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కనపర్తి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కొడాలి ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణ మండపంలో తెదేపా మండల కార్యకర్తల సర్వసభ్య సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదులో అవనిగడ్డ నియోజకవర్గం జిల్లాలోనే ప్రథమస్థానం సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు.

జనసేన బలోపేతానికి చర్యలు

పామర్రు, న్యూస్‌టుడే: జనసేన పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ అన్నారు. శుక్రవారం స్థానిక బొమ్మారెడ్డి సీతారెడ్డి కల్యాణ మంటపంలో ఆ పార్టీ పామర్రు నియోజకవర్గ సమన్వయకర్త తాడిశెట్టి నరేష్ తదితరులతో కలిసి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పామర్రు నియోజకవర్గంలో పదేళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ గురించి వివరించారు. పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొని మండలి రాజేష్, తాడిశెట్టి నరేష్‌ను గజమాలతో సన్మానించారు.



మండలి రాజేష్, తాడిశెట్టి నరేష్‌లను సన్మానిస్తున్న నాయకులు

గుడివాడ పట్టణం: గుడివాడ నియోజకవర్గ జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో టిడ్కో, శ్రీకాళహస్తీశ్వర కాలనీల నుంచి పలువురు జనసేనలో శుక్రవారం చేరారు. కోమరాజు మణికుమార్, వరదా హరి కుమార్ అనుచరులు పార్టీలో చేరారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: పట్టభద్రులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నియోజకవర్గ తెదేపా పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. తెదేపా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు బండే కనకదుర్గ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు నమోదుకు దరఖాస్తు ఇస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరులో శుక్రవారం నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు పాల్గొన్నారు. శాసన మండలిలో ప్రశ్నించే వారిని, విద్యావంతుడిని ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెదప్రోలు(మోపిదేవి), న్యూస్‌టుడే: పట్టభద్రులు ఓటు నమోదుకు ఫారం 18 పూర్తిచేసి తహసీల్దార్ కార్యాలయంలో, లేదా పాత పంచాయతీ కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్న నమోదు కేంద్రంలో సమర్పించాలని ఎంపీపీ రావి దుర్గావాణి పేర్కొన్నారు. శుక్రవారం మోపిదేవి, పెదప్రోలు పాఠశాలలను సందర్శించి ఓటు నమోదుకు అవసరమైన పత్రాలను ఉపాధ్యాయులకు అందించారు. రావి నాగేశ్వరరావు, నడకుదిటి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న మండల విద్యాశాఖ అధికారి టీవీఎం రామదాసు

నాగాయలంక, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో రాష్ట్రస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి నాగాయలంక మండలం తలగడదీవి జడ్పీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని కొక్కిలిగడ్డ సుజాత సీనియర్ విభాగంలో ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండ్రెడ్డి శివరామ్‌ప్రసాద్ తెలిపారు. విద్యార్థినిని మండల విద్యాశాఖ అధికారి టీవీఎం రామదాసు, తదితరులు అభినందించారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా, సిబ్బంది

ప్రతి ఇంటికీ వెళ్లి పశు సంపద లెక్కించాలి

పామర్రు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ ఎన్యూమరేటర్లు వెళ్లి పశు సంపదను లెక్కించి ఆన్‌లైన్లో నమోదు చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. శుక్రవారం స్థానిక పశువుల ఆసుపత్రి ఆవరణలో పశుగణనకు సంబంధించిన గోడపత్రికలను వైద్యశాల సిబ్బందితో కలిసి ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పామర్రు ఏడీ చిమటా శశికుమార్, జమీదగ్గుమిల్లి డాక్టర్ సునీల్, పెదమద్దాలి డాక్టర్ విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు, నందివాడ(గుడివాడ గ్రామీణం), న్యూస్‌టుడే: గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడులో 21వ జాతీయస్థాయి పశుగణన కార్యక్రమాన్ని వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీవీణ శుక్రవారం ప్రారంభించారు. అయిదేళ్లకోసారి నిర్వహించే ఈ కార్యక్రమం వచ్చే ఫిబ్రవరి నెలాఖరువరకూ కొనసాగుతుందన్నారు. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, కోళ్లను గణించి ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సర్పంచి గరికపాటి రాంబాబు, జనసేన మండల అధ్యక్షుడు పెన్నేరు రమేష్, గరికపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

☛ నందివాడ మండలం ఇలపర్రులో శుక్రవారం పశుగణన కార్యక్రమం తెదేపా మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పశు సంపద లెక్కిస్తామని మండల పశువైద్యురాలు లతాశ్రీ, రుద్రపాక పశువైద్యురాలు ఐ.రమ్య తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

చినపులిపాక(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. చినపులిపాకలో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీ వ్యవస్థను నాశనం చేసి, గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అభివృద్ధి కార్యాక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, తెదేపా బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, సర్పంచి ఆరేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణాలకు చర్యలు

పామర్రు: తోట్లవల్లూరు, పమిడిముక్కల, పెదపారుపూడి మండలాల్లోని పాములలంక, వేలూర్పు, బుడమేరుకు వంతెనల నిర్మాణానికి కలెక్టర్‌కు అంచనాలు పంపగా నిధులు మంజూరుకు అంగీకరించారని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లూరుపల్లి గణేష్, చాట్ల రమేష్, కేదరాశిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాకారుల దినోత్సవం

పామర్రు, న్యూస్‌టుడే: కళాకారుల దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక హితమ్ పాఠశాలలో ఘంటసాల, ఎన్టీఆర్ కళాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకటమురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తబలా కళాకారులు శంకర్, లలిత సంగీత గాయని మల్లేశ్వరమ్మ, తాళం భజన కళాకారుడు అంజిరెడ్డి, చెక్కభజన గురువు రెడ్డి, గాయకుడు అరవపల్లిరావు, సంజీవరావు, కూచిపూడి నృత్య కళాకారుడు శాస్త్రిలను ప్రముఖ వైద్యుడు బీవీ అప్పారావు కళాపీఠం సభ్యులతో కలిసి సన్మానించారు.



కళాకారులను సన్మానిస్తున్న కళాపీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ, బీవీ అప్పారావు తదితరులు

డీఈఈ బాధ్యతల స్వీకరణ



పులిగడ్డ వెంకటేశ్వరరావు

పులిగడ్డ(అవనిగడ్డగ్రామీణం), న్యూస్‌టుడే: జలవనరుల శాఖ పులిగడ్డ సబ్‌డివిజన్ డీఈఈగా పూర్తి అదనపు బాధ్యతలతో పులిగడ్డ వెంకటేశ్వరరావు శుక్రవారం విధుల్లో చేరారు. ఆయన ఇంతవరకు మోపిదేవి సెక్షన్‌లో ఏఈఈగా పనిచేశారు. ఇక్కడ డీఈఈగా పనిచేసిన రావెళ్ల రవికిరణ్ విజయవాడ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు

రీసర్వే సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

ముళ్లపూడి (పమిడిముక్కల), న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో రీసర్వే జరిగిన గ్రామాల్లోని రైతుల సర్వే సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని రీసర్వే ఉప తహసీల్దారు కె. ఏసుపాదం తెలిపారు. శుక్రవారం ముళ్లపూడి గ్రామసభలో భూములకు సంబంధించి పేరు మార్పునకు 20, సవరణలకు 1, డిజిటల్ సంతకానికి 1, భూవిస్తీర్ణం తేడాలకు సంబంధించి 6 దరఖాస్తులు అందాయని తెలిపారు. సర్పంచి పి.అంజిబాబు, వైస్ ఎంపీపీ కె.మహేష్, మండల సర్వేయరు సుధీర్, వీఆర్వో శివశంకర్ పాల్గొన్నారు.

చిలకలపూడి, (ఘంటసాల): రైతులు గ్రామసభలను వినియోగించుకోవాలని రీసర్వే డీటీ పి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం చిలకలపూడిలో భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే గ్రామసభను నిర్వహించగా, 24 అర్జీలు వచ్చాయని చెప్పారు. ఏవో కె.మురళీకృష్ణ, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వల్లీపుష్ప, వీఆర్వో మనీష, రైతులు పాల్గొన్నారు.

‘ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు’

గుడివాడ పట్టణం: పట్టణంలోని బంటుమిల్లి రోడ్డులో ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని గుడివాడ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు శుక్రవారం ఎక్సైజ్ సీఐ పి.వెంకట రమణకు వినతి పత్రం సమర్పించారు.

మండలంలో ఇసుక రీచ్‌లు లేవు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి మండలంలో ఇసుక రీచ్‌లు లేవని తహసీల్దార్ ఎం.శ్రీవిద్య శుక్రవారం పేర్కొన్నారు. ఎడ్లబండిపై కూడా ఇసుక తోలవద్దని, అక్రమంగా రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, ఎస్ఐ వీరవెంకట సత్యనారాయణ చెప్పారు. ప్రభుత్వం గుర్తించిన రీచ్‌లలో మాత్రమే ఉచిత ఇసుక లభిస్తోందని తెలిపారు.

ఊర చెరువు నీటితో ఇబ్బందులు

కోడూరు పంచాయతీ శివారు యర్రారెడ్డిపాలెంలోని ఊర చెరువు పిచ్చిమొక్కలు, తుంగతో నిండిపోయింది. చెరువులోని నీరు చుట్టుపక్కల గృహాల చెంతకు చేరడంతో దోమలు విజృంభిస్తూ విష జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊర చెరువులోని మురుగునీరు, పసరెక్కిన నీరు బయటకు పోయే బోదె పూడికపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. ఇళ్లకు వెళ్లాలంటే ఆ నీటిలో నడుస్తూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోడూరు (అవనిగడ్డ)



ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

తిరిగేదెలా... కదిలేదెలా?!



బెంజిసర్కిల్ నుంచి బందరు రోడ్డులో మార్గ్ కృష్ణయ్య దగ్గర యూ టర్న్ తీసుకునే వాహనాలు ఒకవైపు.. మరో వైపు ఎన్టీఆర్ కూడలి దగ్గర యూ టర్న్ లేక మార్గ్ కృష్ణయ్య దగ్గరే మలుపు తీసుకునేవి ఇంకోవైపు.. వెరసి బందరురోడ్డుపై ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మలుపు తిరిగే వాహనచోదకులు తాము త్వరగా వెళ్లాలని వాహనం అడ్డుగా తెస్తుంటే.. మేమే ముందు వెళ్లాలని బందరోడ్డులో వారు దూసుకొస్తున్నారు. ఇలా వీరు వెళ్లక.. వారు వెళ్లడానికి ఇబ్బంది ఏర్పడి ఏకంగా ట్రాఫిక్ భారీగా నిలిచిపోతోంది. ఉదయం, సాయంత్రం స్కూళ్లు, ఆఫీసులకు వెళ్లి వచ్చేటప్పుడు తీవ్ర ట్రాఫిక్‌తో చోదకులు తల్లడిల్లుతున్నారు. కనీసం ఆ వేళలోనైనా ఎన్టీఆర్ కూడలిలో వాహనాలు మలుపు తిరిగే ఏర్పాట్లు చేసి కష్టాలు తీర్చాలని చోదకులు కోరుతున్నారు. **- ఈనాడు, అమరావతి**

అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

భాజపా ఏపీ అధ్యక్షురాలు

భవానీపురం, న్యూస్‌టుడే : అమరావతి రాజధాని నిర్మాణానికి భాజపా కట్టుబడి ఉందని, ఆ ప్రకారం అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. అమరావతి రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడంతో శుక్రవారం విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ



మాట్లాడుతున్న పురందేశ్వరి

అమరావతికి రూ.2,245 కోట్ల వ్యయంతో నూతన రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ఈ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అకాల వర్షాలు, పర్యావరణ మార్పులతో ఇబ్బందులు పడుతున్నామని, అడవులను పాడు చేయకుండా దీని నిర్మాణం జరుగుతుందన్నారు. విశాఖ రైల్వేజోన్ నిర్మాణానికి గత ప్రభుత్వం సరైన స్థలం ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం స్థలం మంజూరుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. నాలుగు నెలల్లో రైల్వేజోన్ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని, అందులో భాగంగా 57 కి.మీ రైల్వేలైన్‌ను మంజూరు చేసిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం పెద్దఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం బాణాసంచా కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. శివన్నారాయణ, యామిని శర్మ, వెంకట సత్యనారాయణ, పాతూరి నాగభూషణం, షేక్.బాజీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కీలకం!

ఈనాడు – అమరావతి

"సుదీర్ఘ కాలం తర్వాత ఉమ్మడి కృష్ణాలో సాగునీటి సంఘాల ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఐదేళ్లుగా సాగునీటి సంఘాల ఎన్నికల ఊసే లేదు. ప్రస్తుతం నీటి వినియోగదారుల సంఘాలు, పంపిణీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించారు. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎన్నికల తర్వాత రాష్ట్రస్థాయి అపెక్స్ కమిటీ ప్రాధాన్యం సంతరించుకోనుంది. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటైతే.. బాధ్యతాయుతంగా సాగునీటిని వినియోగించి దుర్వినియోగం అరికట్టే వీలుంది. జగన్ ఏలుబడిలో వీటిని విస్మరించగా అధికారులే నడిపించారు. ఉమ్మడి జిల్లాలో మూడు ప్రాజెక్టు కమిటీలు ఏర్పాటు కావాలి. ప్రధానంగా నీటి పంపిణీ, కాలువల నిర్వహణ, మరమ్మతులు తదితర బాధ్యతలు నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగించే వీలుంది. గతంలో తెదేపా ప్రభుత్వం నీటి వినియోగదారుల సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వగా క్రియాశీలకంగా నడిచాయి."

- సాగునీటి సంఘాల ఎన్నికల హడావుడి
- ఆయకట్టుదారుల గుర్తింపు ప్రారంభం
- నవంబరు 21న ఎన్నికల నిర్వహణ



బందరు కాలువ

అత్యంత ప్రతిష్ఠాత్మకం..

★ జిల్లాలో తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారనుంది. దీని కింద ప్రధానంగా ఏలూరు కాలువ, బందరు కాలువ, రైవస్ కాలువలు ఉన్నాయి. కృష్ణా, ఏలూరు జిల్లాల్లోనూ ఆయకట్టు ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ గ్రామీణంలోనే ఉంది. ముందుగా ఆయకట్టు రైతుల గుర్తింపు చేపట్టారు. జలవనరుల శాఖ అధికారులు ఆయకట్టుదారుల జాబితా తయారు చేసి.. వచ్చే నెల 13న తుది జాబితా ప్రకటిస్తారు. ముందుగా అభ్యంతరాలు స్వీకరించి ఆర్డీవో ఆధ్వర్యంలో పరిష్కరిస్తారు. ప్రతి పంపిణీ కమిటీ కింద 5-12 నీటి వినియోగదారుల సంఘాలు ఉంటాయి. నీటి వినియోగదారుల సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులతో ఒక కమిటీ ఏర్పాటవుతుంది. దీనికి రాజకీయంగా ప్రాధాన్యం ఉంది. వచ్చే నెల 24న పంపిణీ కమిటీలను ఎన్నుకుంటారు. తర్వాత నవంబరు 27న ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటారు.

అపెక్సు కమిటీలో ప్రాధాన్యం..

★ అపెక్సు కమిటీలో కృష్ణా జిల్లా తూర్పు డెల్టా నుంచి తప్పక ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్రంలో ఇది కీలకంగా మారనుంది. ఈసారి ఎలాంటి ప్రాధాన్యం దక్కుతుందనే దానిపై చర్చ సాగుతోంది. గతంలో అపెక్సు కమిటీ సభ్యునిగా ఆళ్ల గోపాలకృష్ణ (గన్నవరం) వ్యవహరించారు. ఆయన సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడిగా ఉన్నారు.

నేరుగా కమిటీ పరిధిలోనే..

★ ఉమ్మడి కృష్ణాలో మూడో ప్రాజెక్టు కమిటీ మధ్యతరహా, చిన్న నీటి పారుదలకు కేటాయించారు. పెనుగంచిప్రోలులో మున్నేరు వాగుపై ఒక ఆనకట్ట ఉంది. మున్నేరు, తమ్మిలేరు కలిపి ఈ ప్రాజెక్టు కమిటీ ఉంది. దీని పరిధిలో రెండు మాత్రమే డీసీ కమిటీలు ఉన్నాయి. చిన్న నీటి పారుదలకు ప్రతి 100 ఎకరాలు ఉన్న ఆయకట్టు చెరువు కింద నీటి వినియోగదారుల సంఘం ఏర్పాటు చేయాలి. వీటికి పంపిణీ కమిటీలు లేవు. నేరుగా ప్రాజెక్టు కమిటీ పరిధిలో ఉంటారు. వత్సవాయి, నందిగామ, పెనుగంచిప్రోలు మండలాలతో పాటు తమ్మిలేరు కింద చాట్రాయి మండలం దీని పరిధిలో చేర్చారు. చిన్న నీటి పారుదల కింద దాదాపు 212 నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటు కానున్నాయి.

శివారుకు నీరందేలా...

★ఎన్నెస్పీ ఆయకట్టుకు ఒక ప్రాజెక్టు కమిటీ జిల్లాకు కేటాయించారు. జోన్ 2, జోన్ 3 పరిధిలో నూజివీడు, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ ఉన్నాయి. కానీ ఎన్నెస్పీ ఎడమ కాలువ ప్రాజెక్టు పరిధిలో జోన్2, జోన్ 3లకు సరిగా నీరు రావడం లేదు. జగ్గయ్యపేట, నూజివీడు సబ్ జోన్లకు పూర్తిగా నీరందని పరిస్థితి. దీనికి ప్రాజెక్టు కమిటీ ఎన్నుకోనున్నారు. 106 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 17 డీసీలు ఉన్నాయి. శివారుకు నీరు దేలా మరింత చొరవచూపే వీలుంది.

ఉమ్మడి జిల్లాలో కమిటీల తీరు

ప్రాజెక్టు కమిటీలు	: 03
తూర్పు డెల్టా..	
పంపిణీ కమిటీలు	: 32
సాగునీటి సంఘాలు	: 222
ఆయకట్టు: 7.39 లక్షల ఎకరాలు	
నాగార్జునసాగర్ ఎడమ కాలువ	
(జోన్ 2, జోన్ 3)	
పంపిణీ కమిటీలు (డీసీలు)	: 17
సాగునీటి సంఘాలు	: 106
ఆయకట్టు : 3.62 లక్షల ఎకరాలు	
మధ్యతరహా, చిన్న నీటి తరహా (మున్నేరు)	
పంపిణీ కమిటీలు (డీసీ)	: 02
సాగునీటి సంఘాలు	: 151
ఆయకట్టు: మున్నేరు, తమ్మిలేరు: 2,131 ఎకరాలు, ప్రతి 100 ఎకరాలు ఉన్న చెరువులు	

ఏపీ జీఎన్‌ఏ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల ఎన్నిక నేడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ (ఏపీ జీఎన్‌ఏ) ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 26వ తేదీ శనివారం ఆ సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్ల ఎన్నిక ఉంటుందని ఎన్నికల నిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం బైలాస్, ఏపీ సీఎస్ (ఆర్‌ఓఎస్‌ఏ) నిబంధనల 2001 ప్రకారం అత్యంత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మహాత్మా గాంధీ రోడ్డులోని కృష్ణాజిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో ఉదయం సమావేశం ఉంటుందని తెలిపారు. ఎన్నికైన జిల్లా యూనిట్ల ఆఫీస్ బేరర్లు హాజరు కావాలని ఆయన సూచించారు. సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన ఒరిజినల్ డిక్లరేషన్ ఫారం (ఫారం 12)తో పాటు ఫొటో గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

త్వరితగతిన బీమా క్లెయిమ్‌ల పరిష్కారం



మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, పక్కనే మనీష్ కుమార్, హాజరైన బీమా సంస్థల ప్రతినిధులు, అధికారులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వరద ప్రభావిత ప్రాంత ప్రజల వాహనాలు, వివిధ ఆస్తి నష్టాలకు సంబంధించి బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో బీమా సంస్థల కృషి ప్రశంసనీయమని, పెండింగులో ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాతో కలిసి, వివిధ బీమా సంస్థల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. బీమా సంస్థల వారీగా నమోదైన, పరిష్కరించిన, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లపై చర్చించారు. 12,632 మోటార్ వాహనాలు, 2,794 ఆస్తులకు సంబంధించి మొత్తం 15,426 క్లెయిమ్‌లు నమోదవగా, 605 ఉపసంహరణ, 325 తిరస్కరణకు గురైనట్టు పేర్కొన్నారు. మిగతా 14,496 క్లెయిమ్‌ల్లో ఆన్ అకౌంట్, అండర్ ఆక్షన్‌తో సహా 97.16 శాతం మేర సెటిల్‌మెంట్ చేసినట్టు రవాణా శాఖ అధికారులు వివరించారు. మొత్తం రూ.136.52 కోట్ల మేర చెల్లింపులు చేసినట్టు వెల్లడించారు. సిసోడియా మాట్లాడుతూ. . క్లెయిమ్‌ల పరిష్కారంపై సీఎం చంద్రబాబు మొదటి నుంచి ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలిపారు. బీమా సంస్థలు మెరుగైన పనితీరు కనబరిచినట్టు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో పెండింగులో ఉన్న ద్విచక్ర, త్రిచక్ర, ప్రైవేటు కార్లు, ట్యాక్సీలు, వాణిజ్య వాహనాలతో పాటు, కుటుంబాలు, దుకాణాలు, ఎస్.ఎం.ఇ, ఎం.ఎస్.ఎం.ఇ. ఆస్తుల నష్టాలకు సంబంధించిన క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ డీటీసీ సి.హెచ్.మోహన్, డీటీసీ (ఐటీ) ఎం.పురేంద్ర, బీమా కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

టిప్పర్ లారీ క్యాబిన్ దగ్ధం



ఎగసిపడుతున్న మంటలు

భవానీపురం, న్యూస్‌టుడే : విద్యాధరపురం సితార సెంటర్ రోడ్డులో శుక్రవారం ఉదయం టిప్పర్ లారీ క్యాబిన్‌లో నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి... మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి రాళ్లను కంచికచర్ల నుంచి టిప్పర్‌లో వేసుకుని తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో సితార సెంటర్ వద్దకు వచ్చే సరికి లారీ క్యాబిన్‌లో నుంచి మంటలు వస్తున్నాయి. దీంతో డ్రైవర్ రామాంజనేయులు అందులో నుంచి బయటకు వచ్చేశారు. కొద్దిసేపటికే క్యాబిన్ మొత్తం మంటలు చెలరేగాయి. కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి వాటిని అదుపు చేశారు. విద్యుదాఘాతం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

డ్రైవర్ పేరిట ఫైనాన్స్ సంస్థ ఏర్పాటు

- ✶ దారి మళ్లించిన సొమ్ము అందులోకి బదిలీ
- ✶ దర్యాప్తులో వెలుగుచూస్తున్న నాటి ఐసీఐసీఐ మేనేజర్ నరేష్ అక్రమాలు
- ✶ ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించిన గుంటూరు సీఐడీ

పటమట, న్యూస్‌టుడే: ఐసీఐసీఐ బ్యాంకులో మేనేజర్ నరేష్ చేసిన కుంభకోణానికి సంబంధించి దర్యాప్తులో అనేక కీలక విషయాలు వెలుగుచూస్తున్నాయి. దీనిపై విచారణ చేస్తున్న గుంటూరు సీఐడీ అధికారులు అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. ఖాతాదారుల ఎఫ్‌డీలు, ఖాతాల్లోని నగదును సొంత అవసరాలకు దారి మళ్లించిన మేనేజర్ అక్రమాలపై సునిశిత దృష్టి సారించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట, చిలకలూరిపేట, విజయవాడలోని భారతీనగర్ బ్యాంకు శాఖల్లో కుంభకోణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. భారతీనగర్ శాఖలో బాధితులు దాదాపు 15 మంది వరకు ఉన్నట్లు తేలింది. నెల రోజుల నుంచి పరారీలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ నరేష్ చంద్రశేఖర్ ఖాతాదారులు నుంచి కొల్లగొట్టిన డబ్బును నెక్సస్ గ్రోత్ అనే ఫైనాన్స్ సంస్థకు మళ్లించినట్లు సీఐడీ పోలీసులు గుర్తించారు. ఆ సంస్థను నరేష్ తన దగ్గర పని చేసే డ్రైవర్ ప్రభు శేఖర్ పేరు మీద ప్రారంభించినట్లు పోలీసుల విచారణలో తేలింది. నెక్సస్ గ్రోత్ అనే సంస్థ కార్యాలయంలో కూడా విజయవాడ ఐసీఐసీఐ బ్యాంకు ఉన్న భవనంలో ఉండటం గమనార్హం. శుక్రవారం ఈ సంస్థ వద్దకు సీఐడీ పోలీసులు వచ్చారు. ఆ సమయంలో మూసి ఉంది. కుంభకోణం బయట పడినప్పటి నుంచి మూసివేసినట్లు తెలిసింది. దీంతో కార్యాలయం గోడపై విచారణకు రావాలని సీఐడీ పోలీసులు నోటీసులు అందించారు. ప్రభు శేఖర్ సైతం పరారీ ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రభు శేఖర్ దుబాయ్ పరారీ అయ్యేందుకు గత నెలలో ఓ ముస్లిం మహిళను వివాహం చేసుకున్నట్లు సమాచారం.

కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు: మేనేజర్ కుటుంబ సభ్యులు నరేష్ కనడపడటం లేదని విజయవాడ పటమట పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై పటమట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గత నెల 26న నరేష్ హైదరాబాద్‌లో తనకు డబ్బులు రావాల్సి ఉందని వాటి కోసం వెళ్తున్నట్లు భార్య సరోజినికి తెలిపాడు. తండ్రి సురేష్‌కు వైద్యం చేయించేందుకు తనతో పాటు హైదరాబాద్‌కు తీసుకు వెళ్లాడనీ, వైద్యం చేయించుకున్న అనంతరం బాలానగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారని పేర్కొన్నారు. 28న నరేష్ తన భార్య సరోజినికి వీడియో కాల్ చేసి హైదరాబాద్‌కు వచ్చిన పనులు అవట్లేదని బాధపడ్డాడు. ఆ రోజు నుంచి ఫోన్ స్విచాఫ్‌లో ఉన్నట్లు బంధువులకు కూడా నరేష్ ఆచూకీ తెలియదంటూ అతని భార్య ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ద్విచక్ర వాహనం తొక్కడంతో మృతి చెందిన సీతాకోక చిలుక



చనిపోయిన దాన్ని తాకి చూస్తున్న గొల్లభామ



క్షణాల్లోనే సీతాకోక చిలుకలు చుట్టూ చేరాయి ఇలా..

మరువలేని నేస్తమా.. మరలిరాని ప్రాణమా

ఒక మనిషికి రహదారిపై ఏదయినా ప్రమాదం జరిగి కష్టంలో ఉంటే చూసి సాయం చేద్దాం అనే ఆలోచన కూడా రానంత బిజీగా మానవ జీవితాలు మారిపోయాయి. మనకేందుకులే అని కనీసం తొంగి చూడడానికి కూడా సమయం కేటాయించని రోజులు ఇవీ.. ఒక కాకి మృతి చెందితే పదుల సంఖ్యలో కాకులు అక్కడకు చేరతాయి అంటారు. కానీ ఈ చిత్రాలు చూస్తే సీతాకోక చిలుకలకు మనస్సు, మానవత్వం ఉంది అనిపిస్తుంది కదూ.. కొండపల్లి అటవీ ప్రాంతంలో ఒక సీతాకోక చిలుకను ద్విచక్ర వాహనం తొక్కి వెళ్లిపోవడంతో చనిపోయింది. కొద్ది క్షణాల్లోనే రోడ్డు మీద పడి ఉన్న దాన్ని ఒక గొల్లభామ (గ్రాస్‌హాపర్) వచ్చి చూడగా, తర్వాత వరుసగా ఒక్కొక్క సీతాకోక చిలుక వచ్చి చనిపోయిన దాన్ని తడుముతూ చుట్టూ గుంపుగా చేరాయి. ఏడెనిమిది సీతాకోక చిలుకలు వచ్చి సంచరిస్తూ ఇలా కనిపించాయి.

- ఈనాడు, అమరావతి

'వైకాపా పాలనలో ముదిరాజ్‌లకు తీవ్ర అన్యాయం'



మాట్లాడుతున్న కృష్ణమోహన్. పక్కన దుర్గారావు, శ్రీనివాసరావు, రాజారావు, శ్రీనివాస్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : గత వైకాపా పాలనలో ముదిరాజ్ కులస్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ విమర్శించారు. శుక్రవారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సంఘీయుల సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసినా పట్టించుకోలేదని దుయ్యబట్టారు. పేరుకే 56 బీసీ కార్పొరేషన్లు అని, ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. బీసీలంటే బ్యాక్ బోన్ అని గొప్పలు చెబుతూ.. అన్ని విధాలా వంచించారని పేర్కొన్నారు. కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. గత ఎన్నికల్లో తెదేపా గెలుపునకు ఎంతో కృషి చేశామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 15లక్షల మంది కులస్థులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.దుర్గారావు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు జలకం రాజారావు, వి.వీరబాబు, పి.వెంకటరామయ్య, జంధ్యాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గనుల శాఖ డీడీగా శ్రీనివాసకుమార్

ఈనాడు, అమరావతి: దాదాపు నాలుగు నెలల తర్వాత జిల్లా గనులు, భూగర్భ గనుల శాఖ అధికారిని ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ జిల్లా అధికారిగా డిప్యూటీ డైరెక్టర్ హోదాలో శ్రీనివాసకుమార్‌ను ప్రభుత్వం నియమించింది. గతంలో కృష్ణా జిల్లాలో ఏడీగా పనిచేశారు. నెల్లూరు జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. అంతకు ముందు డీడీగా ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరరావు మేలో పదవీ విరమణ చేశారు. తర్వాత ఏడీ వీరాస్వామి ఇన్‌ఛార్జిగా కొంతకాలం కొనసాగారు. ప్రస్తుతం ఉచిత ఇసుక కీలకంగా మారడంతో నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై డీడీని నియమించింది. ఇటీవల ఆయన బాధ్యతలు స్వీకరించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువును ఈనెల 27వ తేదీ వరకు పొడిగించినట్టు ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. అభ్యర్థులు http:///jnanabhumi.ap.gov.in (జ్ఞానభూమి) ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బ్యాడ్మింటన్ టోర్నీ టీమ్ ఛాంప్ ఏపీ

విజయవాడ క్రీడలు: ఇండియన్ ఆడిట్, అకౌంట్స్ విభాగం రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన దక్షిణ భారత అంతర్ మండలాల బ్యాడ్మింటన్ టోర్నీలో టీమ్ ఛాంపియన్‌షిప్‌ను ఆంధ్రప్రదేశ్ కార్యాలయం సొంతం చేసుకుంది. శుక్రవారం స్థానిక డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంలో ఫైనల్స్ జరిగాయి. పురుషుల సింగిల్స్‌లో శ్రీచరణ్



ఛాంపియన్‌షిప్ జట్టుతో అతిథులు గంగూలీ ప్రసాద్, చంద్రమౌళి సింగ్, కిషోర్‌రెడ్డి, కె.భాస్కర్, తదితరులు

కోయ (ఏపీ), యష్ యోగి (కర్ణాటక), మహిళల సింగిల్స్‌లో సారా నక్వీ (కర్ణాటక), టి.దీప్తి (తెలంగాణ) ప్రథమ, ద్వితీయ స్థానాలు సొంతం చేసుకున్నారు. పురుషుల డబుల్స్‌లో డి.సంజయ్ శ్రీవత్స-సిద్ధార్థ ఎలంగో (తమిళనాడు) జోడీ ప్రథమ, ఎడ్విన్ జోయ్-రాహుల్ ఆజాద్ తల్లూరి (కేరళ, ఏపీ) జోడీ ద్వితీయ, మహిళల డబుల్స్‌లో అరుల్ బాల-సారా నక్వీ (కర్ణాటక) జోడీ ప్రథమ, ఎన్.సుశ్వేత-వి.శీతల్ మోహన్‌దాస్ (ఏపీ, తెలంగాణ) జోడీ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో డి.సంజయ్ శ్రీవత్స-అరుల్ బాల (తమిళనాడు, కర్ణాటక) జోడీ ప్రథమ, ఎం.అర్జున్‌కుమార్‌రెడ్డి - ఎన్.సుశ్వేత (తెలంగాణ, ఏపీ) జోడీ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. వెటరన్స్ 35, 40, 45, 50 విభాగాలు స్త్రీ, పురుషుల సింగిల్స్‌తో పాటు 55 పురుషుల సింగిల్స్‌లో నిర్వహించిన పోటీలో విజేతలను ప్రకటించారు. ద్రోణాచార్య అవార్డీ గంగూలీ ప్రసాద్ విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కిషోర్‌రెడ్డి, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నిఖిల పాల్గొన్నారు.

యువతి ఫొటోతో పోర్న్ ఖాతా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థిని ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టి పోర్న్ సైట్‌లో ఖాతా సృష్టించి వేధిస్తున్న సైబర్ నేరగాళ్లపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడ శివారు ప్రాంతానికి చెందిన ఓ యువతి (18) బీటెక్ చదువుతున్నారు. మూడు నెలలుగా గుర్తు తెలియని వ్యక్తి.. ఆమె పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిచి, పురుషులతో ఛాటింగ్ చేస్తున్నట్లు ఆమె గుర్తించారు. అక్కడితో ఆగకుండా.. పోర్న్ సైట్‌లోనూ ఆమె ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టి ఖాతా తెరిచాడు. ఈ వివరాలన్నీ బహిర్గతం కావడంతో ఆమె తీవ్రమైన మనోవేదనకు, మానసిక ఒత్తిడికి గురయ్యారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంబయి పోయి... బెంగళూరు వచ్చె..

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.43 లక్షల వసూళ్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : మీ పేరుతో ఉన్న పార్శిల్‌లో మాదకద్రవ్యాలున్నాయి. నకిలీ పాస్‌పోర్టులు, పెద్ద స్కామ్‌లో మీ పాత్ర బయటపడిందంటూ ముంబయి పోలీసుల పేరుతో టోకరా వేసే సైబర్ నేరగాళ్లు.. పంథా మార్చారు. ముంబయికి బదులు బెంగళూరు పోలీసులమని భయపెట్టి డబ్బులు గుంజుతున్నారు. తాజాగా విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన ఓ విశ్రాంత అధికారి (72)ని భయపెట్టారు. ఒక భారీ స్కామ్‌లో ఇరుక్కున్నారంటూ బెదిరించి రూ.43 లక్షలు గుంజేశారు. ఆయనకు ఈ నెల 19న గుర్తుతెలియని వాట్సాప్ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. తాను బెంగళూరు పోలీసునని పరిచయం చేసుకున్నాడు. ఒక స్కామ్‌లో మీ పేరు ఉందని, దీని నుంచి మిమ్మల్ని తప్పించాలంటే రూ.43లక్షలు చెల్లించాలన్నాడు. భయపడిపోయిన ఆయన.. అడిగిన మొత్తాన్ని రెండు ఖాతాలకు పంపించారు. అవి దిల్లీ, సూరత్‌ల్లోని బంధన్ బ్యాంకు శాఖలుగా పోలీసులు గుర్తించారు. దీనిపై బాధితుడు. . సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.5.5 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు ధ్వంసం



సరకును ధ్వంసం చేస్తున్న కస్టమ్స్ అధికారులు

ఈనాడు డిజిటల్, అమరావతి : నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన రూ.5.5 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను ఏపీ కస్టమ్స్ అధికారులు శుక్రవారం కాల్చి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏపీ కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. కాకినాడ, విజయవాడ, నెల్లూరు, తిరుపతి నగరాల్లో పట్టుకున్న విదేశీ సిగరెట్లను స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా కాల్చివేసినట్లు తెలిపారు. గుంటూరులోని జిందాల్ ప్లాంట్‌లో 73.71 లక్షల సిగరెట్లు, విశాఖ జిందాల్ ప్లాంట్‌లో 9లక్షల సిగరెట్ స్టిక్‌లను ప్రభుత్వ అనుమతులతో, పర్యావరణానికి హాని కలుగకుండా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఇటువంటి నాసిరకం సిగరెట్లను ఎవరైనా విక్రయించినా.. సరఫరా చేసినా భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్ఐ సాహస సూర్య, కస్టమ్స్ ఏసీ అబ్దుల్ అజీమ్, సూపరింటెండెంట్లు కిషోర్, వివేక్, వేణుగోపాల్, ఎన్.శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.